సంపుటి : 9
సంచిక : 289
ఆదివారం
12 జులై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వంవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

## 'హిట్.. రన్ అండ్ ఎస్కేప్..'

# అదే జగన్ నైజం

### రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'హిట్, రన్ అండ్ ఎస్కేప్ అనేది గొడ్డలి పార్టీ అధినేత నైజం' అని సీఎం చంద్రబాబు విమర్శించారు. నేరపూరిత మనస్తత్వం ఉండేవారు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారని, ప్రభుత్వాన్ని, నేతలను లక్ష్యంగా చేసుకొని విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఇక్కడ సంఘటనలు చేయించి.. జగన్ బెంగళూరు వెళ్లి దాక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. "ఏదో ఒక అరాచకానికి.. తెదేపా నేతలను బాధ్యుల్ని చేయాలని చూస్తున్నారు. ఈ సైకోయిజానికి.. ఆధ్యాత్మికత, టెక్నాలజీ పరిష్కారం చూపిస్తాయి. ఇలాంటి సైకో మనస్తత్వమే ఇవాళ తెలంగాణలో ఆరుగురి హత్యకు దారితీసింది. పోక్సో కేసు పెట్టారని.. కేసు పెట్టిన వారిని చంపేశాడు. తనకు సహకరించలేదని సొంత కుటుంబ సభ్యుల్నీ చంపేశాడు. గొడ్డలి పార్టీ అధినేతకూ, ఈ హంతకుడి మనస్తత్వానికి దగ్గర పోలికలు ఉన్నాయి. ఇద్దరి మనస్తత్వాలు ఇంచు మించు ఒక్కటే. కన్న తల్లి, సొంత చెల్లి, మిగతా .. 2లో..

## ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త గేట్ల ఏర్పాటుకు శ్రీకారం

### రూ.153 కోట్లతో 117 పాత గేట్ల స్థానంలో కొత్తవి
### ఈనెల 13న పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉభయ గోదావరి జిల్లాలకు జీవనాడిగా, లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందిస్తున్న సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ ఆధునికీకరణకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కాలం చెల్లిన పాత గేట్ల మిగతా .. 2లో..

### వియత్నాం బోటు ప్రమాద ఘటనపై

## సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వియత్నాంలో పర్యాటక బోటు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి మొత్తం 33 మంది వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో 19 మంది ప్రమాదం జరిగిన బోటులో ఉన్నారు. ఈ ఘటనలో ఇద్దరు చనిపోగా, మిగతా .. 2లో..

### భారత్ - న్యూజిలాండ్ 'వాకా'..

## కొత్త ప్రయాణానికి

# సిద్ధంగా ఉంది

### ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** న్యూజిలాండ్ నలుమూలలా భారతీయులు విస్తరించి ఉన్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వీరే ఇరు దేశాల స్వర్ణయుగ శకానికి నావికులని అభివర్ణించారు. ఈ సందర్భంగా వాకా అనే పదాన్ని ప్రస్తావించారు. ప్రజలను ఏకం చేసేందుకు ఈ పదం ప్రతీకగా నిలుస్తోంది. "వాకా అంటే కేవలం ఒక పడవ అనే అర్థం మాత్రమే కాదు.. కలిసి చేసే ప్రయాణానికి ఇది ఓ చిహ్నం" అని ప్రధాని వివరించారు. భారత్-న్యూజిలాండ్ 'వాకా' ఒక కొత్త ప్రయాణాన్ని ఆరంభించేందుకు సిద్ధంగా ఉందని అక్లాండ్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడారు. "మున్ముందు మరిన్ని అవకాశాలు వస్తాయి. వాటిని మనకు అనుకూలంగా మలచుకోవాలి. నిఖిల్ రవిశంకర్ ఎయిర్ న్యూజిలాండ్ సంస్థకు సీఈవో కాగలరు. ఆనంద్ సత్యానంద్ గవర్నర్ జనరల్ పదవిని చేపట్టగలరు. రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి ప్రతిభావంతులు క్రికెట్ జట్టులో అవకాశాలు అందుకోగలరు. రగ్బీ క్రీడలో న్యూజిలాండ్ నుంచి భారత్ నేర్చుకోవాలని అనుకుంటోంది. అందుకోసం మాకు నిపుణులు, కోచ్‌ల అవసరం ఉంది. భువనేశ్వర్‌లో 'న్యూజిలాండ్ రగ్బీ','రగ్బీ ఇండియా' భాగస్వామ్యంతో శిక్షణా కార్యక్రమం నిర్వహించాం. క్రీడా, సాంకేతిక రంగాల్లో రెండు దేశాలు కలిసి ఎంతో సాధించగలవనే నమ్మకం ఉంది" అని మోదీ అన్నారు. ఇరుదేశాల మధ్య 100 ఏళ్లుగా ఉన్న క్రీడా సంబంధాలకు గుర్తుగా రెండు దేశాల మధ్య స్నేహపూర్వక ఫుట్‌బాల్ సిరీస్ జరగనుంది. దానిలో భాగంగా భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు నవంబర్‌లో న్యూజిలాండ్‌లో పర్యటించనుంది. నవంబర్ 12, 15 తేదీల్లో ఇరు జట్లు రెండు మ్యాచ్‌లు ఆడనున్నాయి.

### నాన్న మరణానికి

## ప్రతీకారం తీర్చుకుంటా

### ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ స్పందించారు. తన తండ్రి అయతుల్లా అలీ ఖమేనీ మరణానికి మిగతా .. 2లో..

### గోదావరి పుష్కరాలకు సమన్వయంతో

## శాశ్వత అభివృద్ధి పనులు చేపడతాం

### పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, పర్యాటక, సాంస్కృతిక & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత గోదావరి పుష్కరాల్లో సుమారు 4 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేయగా, ఒక్క రోజే 68 లక్షల మంది స్నానాలు చేసిన నేపథ్యంలో, ఈసారి 12 రోజుల పుష్కరాల్లో దాదాపు 10 కోట్ల మంది యాత్రికులు గోదావరి తీరం చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆ స్థాయికి తగిన విధంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించి నిర్మాణాత్మకంగా పనిచేయాలని వారు సూచించారు.స్థానిక రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ (ఆర్ఎంసీ) కార్యాలయ సమావేశ మిగతా .. 2లో..

### 1000 క్షిపణులను

## లోడ్ చేసిపెట్టాం

### ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని మిగతా .. 2లో..

## దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూత

### జానకమ్మ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు : సీఎం చంద్రబాబు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ గాయని, 'దక్షిణ భారత గానకోకిల'గా పేరుగాంచిన ఎస్. జానకి గారు కన్నుమూశారు. దశాబ్దాల పాటు తన గానంతో కోట్లాది మంది సంగీత ప్రియులను అలరించిన ఆమె మరణం పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎస్.జానకి మృతి పట్ల చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. "తెలుగు గడ్డ ముద్దుబిడ్డ అయిన జానకమ్మ గారు ఇక లేరన్న వార్త తీవ్ర విచారానికి గురిచేసింది. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన అసాధారణ సంగీత ప్రస్థానంతో ఎన్నో తరాలను తన కాలకతీతమైన గాత్రంతో ఓలలాడించారు. భారతీయ సంగీతానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం" అని చంద్రబాబు కొనియాడారు. ఆమె కుటుంబ సభ్యులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు, సంగీత ప్రపంచానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. జానకి గారి మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని ఆయన అన్నారు.

### ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం

## సానుకూలంగా స్పందించింది

### బొప్పరాజు వెంకటేశ్వర్లు




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందున రేపటి (ఆదివారం) శ్రీకాకుళం ఉద్యమ కార్యాచరణ సన్నద్ధత సమావేశాన్ని వాయిదా వేసుకున్నామని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఉద్యమం చేయడం తమ లక్ష్యం మిగతా .. 2లో..

### కడపలో కరోనాకు

## అడ్డుకట్ట వేయండి

### కలెక్టర్, డీఎంహెచ్‌వోకు ఫోన్లో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశం
### కేసులు నమోదైన ప్రాంతాల్లో కోవిడ్ నిబంధనలు అమలు చేయండి
### ఎప్పటికప్పుడు విదేశాంగ అధికారులతో మాట్లాడుతున్నాం : మంత్రి సవిత



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కడప జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశించారు. అదే సమయంలో కరోనా నివారణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కొవిడ్ -19 నిబంధనలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌ను, డీఎంహెచ్‌వో రవిబాబును ఫోన్లో ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కడపలో ఎనిమిది మిగతా .. 2లో..

## పవన్ రెండు భుజాలకు సర్జరీ

- ★ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన చంద్రబాబు
- ★ రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్‌తో బాధపడుతున్న పవన్
- ★ ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స
- ★ మూడు గంటల పాటు కొనసాగిన ఆపరేషన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రెండు భుజాలకు సంబంధించిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. ఈ విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ... పవన్ కల్యాణ్ త్వరగా, పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. మూడు గంటల పాటు సర్జరీ: పవన్ కల్యాణ్‌కు రెండు భుజాలకు 'రొటేటర్ కఫ్ ఇంజ్యూరీస్' ఉన్నట్లు ఇటీవల చేసిన మెడికల్ టెస్టుల్లో తేలింది. దీనికి సర్జరీనే ఏకైక మిగతా .. 2లో..

### తూర్పు గోదావరి జిల్లా ఫోరం ఫర్ ఆర్‌టిఐ & హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్

## అసోసియేషన్ జిల్లా సమావేశం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫోరం ఫర్ ఆర్‌టిఐ & హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పు గోదావరి జిల్లా స్థాయి ఆత్మీయ సమావేశం కోరుకొండలో జిల్లా అధ్యక్షులు జి.రాజు కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం అయిందని సంస్థ జాతీయ ఛైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్ తెలిపారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ జాతీయ ఛైర్మన్ డాక్టర్ కొమ్మోజు రమేష్ ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా వ్యాప్తంగా చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై సభ్యులతో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కొమ్మోజు రమేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం మానవ హక్కులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం సంఘ సభ్యులపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ హక్కుల గురించి తెలుసుకొని ప్రభుత్వ సేవలను సక్రమంగా మిగతా .. 2లో..




### వియత్నాంలో భారతీయులున్న పడవ మునక..

## మృతుల్లో ఏపీ వాసులు



**విశ్వం వాయిస్ న్యూస్ :** వియత్నాం పర్యటనకు వెళ్లిన భారతీయులకు ఊహించని విషాదం ఎదురైంది. ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న స్పీడ్ బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మంది భారత టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో తెలుగు రాష్ట్రాల మిగతా .. 2లో..

## గేట్లు మూస్తే.. బ్యారేజీలకు ముప్పు

### తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాళేశ్వరానికి శ్రీపాద ఎల్లంపల్లి గుండెకాయ అయితే.. మేడిగడ్డ వెన్నెముక అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం భారమవుతుందని గతంలోనే ఇంజినీర్లు చెప్పారని, నాడు భారమవుతుందని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# అదే జగన్ నైజం

బాబాయ్ వ్యవహారాలు చూశాం. జగన్ నమ్ముకుంది గొడ్డలి, సోషల్ మీడియా ద్వారా విష ప్రచారమే. ప్రజలకు సాంకేతికతతో పాటు ఆధ్యాత్మికత ఎంతో అవసరం. అప్పుడే ఏది నిజమో తెలుసుకొని.. మంచి, చెడులు బేరీజు వేసుకోగలరు. గొడ్డలి పార్టీ అధినేత కుటుంబ చరిత్ర మొత్తం నేర స్వభావమే. తాత ముత్తాతల నుంచి ఇదే వైఖరి కొనసాగుతోంది. ఆ పార్టీ నేతల చరిత్ర కూడా అలాగే తయారవుతోంది. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా భోగాపురం విమానాశ్రయం పూర్తయిపోయింది. అమరావతి, పోలవరం, వెలిగొండ పూర్తవుతున్నాయి. జగన్ .. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మావిగన్ పేరుతో పారిశ్రామిక వేత్తలను గందరగోళానికి గురి చేయాలనుకుంటున్నారు. బ్రాహ్మణి స్టీల్స్ దోపిడీ కథ ఇంతటితో ఆగలేదు. బ్రాహ్మణి స్థలం సమస్యకే ప్రస్తుతానికి ఇన్నేళ్లకు చెక్ పడింది. ఆ పరిశ్రమ వల్ల ఓబుళాపురం మైనింగ్ బ్లాక్ అయ్యింది. అలా జరగకుండా ఉంటే.. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేవి. 4 సిమెంట్ ఫ్యాక్టరీలు, పరిశ్రమలు వచ్చేవి. పెండింగ్‌లో ఉన్న లేపాక్షి భూముల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తాం. లక్షల కోట్ల రాష్ట్ర సంపద దోపిడీ కోసం.. అభివృద్ధికి అడ్డుకట్టవేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం గొడ్డలి పార్టీ అధినేతకు ఇష్టం లేదు. కేవలం నాకు పేరు వస్తుందనే అక్కసుతో ప్రతిదీ అడ్డుకోవాలని చూస్తున్నారు" అని చంద్రబాబు అన్నారు.

## సీఎం చంద్రబాబు తీవ్ర విచారం

మిగిలిన వారిని రక్షించారు. ఒకరు తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. విహార యాత్రకు వెళ్లి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వారు అంతా సురక్షితంగా ఉన్నారు. ప్రమాద ఘటన, బాధితులకు అందుతున్న సాయం, పర్యాటకుల ప్రస్తుత పరిస్థితిపై సిఎం అధికారులతో మాట్లాడారు. ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో బయటపడిన వారిని రాష్ట్రానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు రాష్ట్ర వాసుల కుటుంబ సభ్యులతో మాట్లాడి అవసరమైన సహాయం చేయాలని సిఎం అధికారులను అదేశించారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు... వియత్నాం అధికారులతో, అక్కడ భారత ఎంబసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

## ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త గేట్ల ఏర్పాటుకు శ్రీకారం

స్థానంలో కొత్తవి అమర్చే పనులను ఈ నెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ బృహత్ కార్యక్రమం ద్వారా బ్యారేజీని మరింత పటిష్ఠం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ముందడుగు వేసింది. బ్యారేజీ గేట్లను నిర్మించి 50 ఏళ్లు దాటడంతో వాటి సర్వీస్ లైఫ్ ముగిసిందని, వాటిని మార్చాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) గతంలోనే సిఫార్సు చేసింది. ఈ సూచనల మేరకు, ప్రస్తుత ప్రభుత్వం బ్యారేజీ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఆధునికీకరణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపింది. మొత్తం రూ.152.95 కోట్ల వ్యయంతో ఈ పనులను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా, శిథిలావస్థకు చేరిన 117 ఫ్లడ్ గేట్లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో అధునాతనమైన కొత్త గేట్లను బిగించనున్నారు. దీంతోపాటు, 12 హెడ్ స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు, 175 క్రెస్ట్ గేట్లకు కొత్త రబ్బరు సీల్స్, 734 రోలర్ బేరింగ్స్ అమర్చనున్నారు. బీఈసీఓఎమ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ పనులను దక్కించుకోగా, రెండేళ్లలో పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించనుంది. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం చూపిందన్న విమర్శలు ఉన్నాయి. పులిచింతల, గుండ్లకమ్మ ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని, ధవళేశ్వరం బ్యారేజీ విషయంలోనూ కనీస మరమ్మతులు చేపట్టలేదని ఆరోపణలు వచ్చాయి. అయితే, 2014లో టీడీపీ ప్రభుత్వం రూ.31.77 కోట్లతో 58 గేట్లకు మరమ్మతులు చేయించింది. ఇప్పుడు పూర్తిస్థాయి ఆధునికీకరణకు నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

ఈ నెల 13న ఉదయం 10:25 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, 11:25 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నూతన గేట్ల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 11:45 గంటలకు ఆత్రేయాపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:20 గంటలకు పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. అక్కడ ఈసీఆర్ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించి, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 5:20 గంటలకు పోలవరం పర్యటన ముగించుకుని తిరిగి అమరావతికి చేరుకుంటారు.

# 1000 క్షిపణులను లోడ్ చేసిపెట్టాం

హెచ్చరించారు. ఇప్పటికే 1000 క్షిపణులను లోడ్ చేసిపెట్టామని వెల్లడించారు. ఆ వెంటనే వేలాదిగా విరుచుకుపడతాయని, అందుకు సంబంధించి సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్నదానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. "ఏదైనా జరిగితే.. ఇంతకు ముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించాలని నేను సూచనలు జారీ చేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు. హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్ దాడులు చేయడం.. ఆ వెంటనే ఆ దేశంపై అమెరికా క్షిపణుల వర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధమేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంటర్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. "యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారో.. అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉంటాం" అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

# శాశ్వత అభివృద్ధి పనులు చేపడతాం

మందిరంలో గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.పురపాలక శాఖ మంత్రి డా. పి.నారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో, గత పుష్కరాల నిర్వహణలో ఉన్న అనుభవాన్ని సమర్థంగా వినియోగించి ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పుష్కరాల కోసం చేపట్టే పనులు తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కాకుండా నగరానికి శాశ్వత ఆస్తులుగా నిలిచే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ ద్వారా నిధులను సమీకరించి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.48 కోట్ల ఆర్ఎంసీ నిధులతో పాటు, ఎల్ఆర్ఎస్ ద్వారా మరో రూ.32 కోట్లు సమీకరించి, అదనంగా రూ.120 కోట్ల గ్రాంట్ పొందేలా చర్యలు చేపడుతున్నామని, తద్వారా సుమారు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. టీడీఆర్ బాండ్లకు సంబంధించిన సమగ్ర వివరాలను వెంటనే సమర్పించాలని అధికారు లను ఆదేశించారు. అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పనులను వేగవంతం చేయాలని, అందుకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేయాలని మంత్రి నారాయణ సూచించారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ, మురుగునీటి పారుదల వ్యవస్థ, జంక్షన్‌ల ఆధునీకరణ, శానిటేషన్, విద్యుత్, తాగునీటి వంటి అన్ని అంశాలపై తాజా ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పుష్కరాల విజయవంతమైన నిర్వహణకు రాజమహేంద్రవరం నగరంతో పాటు కొవ్వూరు, నిడదవోలు, ధవళేశ్వరం, పరిసర ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి అవసరమన్నారు. ప్రతి వారం పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ జిల్లా పర్యటనకు రావడం వల్ల అభివృద్ధి పనులకు వేగం పెరగడంతో పాటు అదనపు నిధులు లభిస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రకటించిన రూ.580 కోట్ల అభివృద్ధి నిధులతో పాటు తాజాగా మరో రూ.60 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. నిడదవోలు పరిధిలోని పెండ్యాల, ముక్కామల, తిపర్రు ఘాట్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాలకు తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే కొవ్వూరు- రాజానగరం మండలం విజ్జేశ్వరం -నిడదవోలు వరకు 38 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేస్తే పర్యాటక, రవాణా పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, శాశ్వత అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్రం నుంచి నిధులు విడుదలకు ముఖ్యమంత్రి ద్వారా లేఖ రాయాలని, ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి ద్వారా ఆయా నిధుల సేకరణ కోసం కృషి చేయడం జరుగుతుందనీ తెలియ చేసారు.శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, పుణ్యక్షేత్రం రోడ్డు, గాడాల పుంత రోడ్డు, శ్రీరాంపురం రోడ్డు, పిడింగొయ్యి రోడ్డు అనే నాలుగు ప్రధాన రహదారుల విస్తరణకు సుమారు రూ.88 కోట్లు అవసరమని, ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యుత్ లో-వోల్టేజ్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అవసరమన్నారు. అలాగే సాగునీటి శాఖ, ఆర్అండ్‌బీ శాఖల పనులు, మురుగునీటి పారుదల వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, జంక్షన్‌ల ఆధునీకరణ, శానిటేషన్ పనులను వేగవంతం చేయాలని కోరారు. ధవళేశ్వరం జనార్ధనస్వామి ఆలయం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.శాసనసభ్యుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను సమయానికి పూర్తి చేసి రాజమహేంద్రవరాన్ని ఆదర్శ పుష్కర నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ కే. ఆదిత్య శర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అడ్డుకట్ట వేయండి

కరోనా కేసులు నమోదు కావడమే కాకుండా ఇద్దరు మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో కోవిడ్ -19 నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. స్థానికుల్లో కరోనా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, ఆసుపత్రుల వద్ద మాస్క్ లు వాడకం తప్పనిసరి చేయాలన్నారు. జ్వరం, దగ్గు, ఇతర కోవిడ్ లక్షణాలున్న వారిని గుర్తించి ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్, డీఎంహెచ్ వో రవిబాబు మాట్లాడుతూ, ఎనిమిది కరోనా కేసులు మినహా కొత్తగా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుత కరోనా వెరియంట్ వ్యాప్తిపై శాంపిళ్లను పూణే ల్యాబ్ కు పంపామన్నారు. ప్రస్తుతం నమోదైన కరోనా వేగవంతంగా వ్యాప్తి చెందుతుందా... నెమ్మదిగా సోకుతుందా..? అనేది ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టులో వెల్లడవుతుందన్నారు. ఇప్పటికే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టామని, బ్లీచింగ్ వెదజల్లామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కరోనా నమోదైన కుటుంబాల్లో సభ్యులకు కూడా తక్షణమే పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ నమోదయితే వారిని కూడా ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. నెగిటివ్ వస్తే... కొద్ది రోజుల పాటు వారి ఇళ్లల్లోనే ఐసోలేషన్ లో ఉంచాలని తెలిపారు. మరో మరణం సంభవించకుండా, ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఉన్నవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మేరకు కోవిడ్-19 టీకాలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌ను, డీఎంహెచ్‌వో రవిబాబుకు మంత్రి సవిత ఫోన్లో స్పష్టంచేశారు.

### వియత్నాం బాధిత కటుంబానికి అండగా ఉంటాం

వియత్నాం సందర్శనకు వెళ్లిన కడప వాసి, ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆ దేశంలో జరిగిన బోటు ప్రమాదంలో ముడియం శ్రీధర్ సహా 15 మంది మృత్యువాతపడడం బాధాకరమన్నారు. సంతోషంగా ముగియాల్సిన విదేశీ టూర్ విషాదంగా ముగియడంపై ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని మంత్రి సవిత వ్యక్తంచేశారు. శ్రీధర్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే విదేశాంగ అధికారులతో, ఢిల్లీ ఎపి భవన్ అధికారులతో మంత్రి నారా లోకేశ్ మాట్లాడారని తెలిపారు. ఏపీకి చెందిన టూరిస్ట్ లతో పాటు శ్రీధర్ మృతదేహాన్ని కూడా స్వస్థలానికి రప్పిస్తామన్నారు. ఎప్పటికప్పుడు వియత్నాం, ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులతో మాట్లాడుతున్నామని మంత్రి సవిత తెలిపారు.

# పవన్ రెండు భుజాలకు సర్జరీ

మార్గమని ముంబైలోని ప్రముఖ కోకిలాబెన్ ఆస్పత్రి వైద్యులు తేల్చి చెప్పడంతో ఆయన శస్త్రచికిత్సకు సిద్ధమయ్యారు. వైద్యుల షెడ్యూల్ ప్రకారం శనివారం ఆయనకు దాదాపు మూడు గంటల పాటు ఆపరేషన్ నిర్వహించారు. పవన్ కల్యాణ్‌కు సర్జరీ జరిగిన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో, వేగంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ ఒక ఆత్మీయ పోస్ట్ చేశారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు. ఆయన సర్జరీ విజయవంతం కావడం పట్ల జనసైనికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స విజయవంతం కావడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ముంబయిలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి కావడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యులు కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని తెలిపినట్లు మంత్రి దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అచంచలమైన నిబద్ధత, పట్టుదల గల ప్రజా నాయకుడని, నిరంతరం ప్రజల శ్రేయస్సు, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా శ్రమిస్తున్నారన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని, మళ్లీ యథావిధిగా ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.సమస్య ఏదైనా, ప్రజల్లో ఉంటూ వారి కన్నీళ్లు తుడవాలనే తపన ఉన్న జనసేనాని పవన్ కళ్యాణ్ కు కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, అభిమానుల ప్రార్థనల బలం అండగా ఉన్నాయని, ఆయన తన శారీరక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసమే తపించే నిఖార్సైన ప్రజా నాయకుడని కొనియాడారు. రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన త్వరలోనే పూర్తి శక్తి సామర్థ్యాలతో,రెట్టింపు ఉత్సాహంతో విధుల్లోకి చేరుకుంటారని ఆశిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.ఆయన అనారోగ్యంతో ఉన్నా ప్రజా సమస్యలపై ఆలోచన నిరంతరం సాగుతూనే ఉంటుందని, ప్రజాసేవలో అలసట ఎరుగని ఆయన పోరాట పటిమ, దృఢ సంకల్పం మనందరికీ ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

**తూర్పు గోదావరి జిల్లా ఫోరం ఫర్ ఆర్‌టిఐ & హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్**

# అసోసియేషన్ జిల్లా సమావేశం

పొందేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారీగా అవగాహన సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, హ్యూమన్ రైట్స్ వర్క్‌షాప్‌లు, యువజన మరియు మహిళా చైతన్య సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, రాజ్యాంగ విలువల ప్రచారం, ప్రముఖుల జయంతులు, వర్ధంతి కార్యక్రమాలను జిల్లా స్థాయిలో నిర్వహించాలని వెల్లడించారు. సంస్థ బలోపేతానికి ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేసి కొత్త సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్‌టిఐ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా సభ్యులకు ప్రత్యేక శిక్షణ అందించ నున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు జి రాజు మాట్లాడుతూ జాతీయ చైర్మన్ సూచించిన కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా మరియు మండల స్థాయి సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోడ్డు శివరామకృష్ణ, పి ఎస్ కే ఎల్ వి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మృతుల్లో ఏపీ వాసులు

వాసులున్నారు. కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ మరణించారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఓ మొబైల్ కంపెనీ భారత్ నుంచి తమ డిస్ట్రిబ్యూటర్ల కుటుంబాలను వియత్నాం ట్రిప్‌కు తీసుకెళ్లింది. మొత్తం 250 మంది ఈ యాత్రకు వెళ్లారు. వీరిలో ఏపీ నుంచి 35, తెలంగాణ నుంచి 40 మంది ఉన్నారు. ట్రిప్‌లో భాగంగా వీరు మూడు పడవల్లో సముద్రంలో విహార యాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హాన్ మే రుట్ నుంచి అన్‌థోయ్ పోర్టుకు ఒక స్పీడ్ బోట్ బయల్దేరింది. అందులో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా.. సముద్రంలో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు నీటిలో మునిగిపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల నిర్వాహకులు.. అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, బోటు పూర్తిగా తలకిందులు కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అటు అలల ఉధృతి కూడా తీవ్రంగా ఉండటంతో టూరిస్టులను కాపాడటం కష్టంగా మారింది. వీరిలో కొందరిని రెస్క్యూ సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు గల్లంతవ్వగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగానే బోటు మునిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై వియత్నాంలోని భారత ఎంబసీ స్పందించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపింది. బాధితుల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. బోల్తా పడిన బోటులో ప్రయాణించిన 32 మంది ప్రయాణికుల జాబితాను భారత రాయబార కార్యాలయం విడుదల చేసింది.

### భారత ఎంబసీతో మాట్లాడిన మంత్రి నారా లోకేశ్
### వియత్నాంలో పడవ బోల్తా పడి 15 మంది భారతీయులు మృతి

వియత్నాంలో ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 15 మంది భారతీయులు జలసమాధి అయ్యారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కూడా ఉన్నారని తెలియడంతో రాష్ట్రంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి, సహాయక చర్యలకు ఉపక్రమించింది. ఈ విషయం తెలియగానే రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వియత్నాంలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత పరిస్థితుల గురించి ఆరా తీశారు. బాధితులకు తక్షణమే అవసరమైన సహాయం అందించాలని ఆయన ఎంబసీ అధికారులను కోరారు. ముఖ్యంగా, ప్రమాదంలో మరణించిన తెలుగువారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన సూచించారు.

# గేట్లు మూస్తే.. బ్యారేజీలకు ముప్పు

చెప్పిన ఇంజినీర్లే.. ఇప్పుడు సన్నాయినొక్కులు నొక్కుతున్నారని అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఆ ఇంజినీర్లను జైలుకు పంపనందువల్లే ఇవాళ ఇలా మాట్లాడుతున్నారని అన్నారు. "ప్రభుత్వం ముందు రెండు కమిటీలు ఉన్నాయి. ఒకటి కేంద్ర ప్రభుత్వం వేసిందయితే.. మరొకటి కిలాడీ కమిటీ. అందులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల సభ్యులు. బ్యారేజీల పునరుద్ధరణ అంశంలో ఎన్డీఎస్ఏ కమిటీ సూచనలు పాటించాలని నిర్ణయించాం. కిలాడీల కమిటీ సూచనలు పాటించబోం. మామ గుడిని మింగితే.. అల్లుడు గుడిలో లింగాన్ని మింగే రకం. హరీశ్‌రావు లంచాలు బొక్కారు. కమీషన్లు వసూలు చేసిన సంగతి కేసీఆర్‌కు తెలియడం వల్లే.. ఏడాది పాటు మంత్రి పదవి ఇవ్వలేదు. అందుకే మూడు నెలలు మంత్రి పదవి ఇవ్వాలని హరీశ్‌రావు అడుగుతున్నారు. పాత కమీషన్లు రాబట్టుకునేందుకే.. మంత్రి పదవి అడుగుతున్నారు. ఆంధ్రా వాళ్ల మోచేతి నీళ్లు తాగి బతికే హరీశ్‌రావు బతుకు ఒక బతుకేనా? గురువు కళ్లలో ఆనందం కోసం నేను నీళ్లు వదిలాను అని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. పట్టిసీమ కట్టిందే.. బీఆర్ఎస్ హయాంలో కదా. పట్టిసీమ కట్టి 105 టీఎంసీలు తరలించినప్పుడు హరీశ్‌రావు ఏం చేస్తున్నారు? తెలివి తక్కువ మాటలు, అతితెలివి మాటలు మాట్లాడుతున్నారు. వాళ్లు బందిపోటు దొంగలకంటే ప్రమాదకరం.. ఇప్పుడు ఈటల కూడా అందులో చేరారు. నీళ్లను ఎత్తిపోయాలని ఈటల రాజేందర్ కోరుతున్నారు. ప్రాజెక్టులను ఎన్డీఎస్ఏకు అప్పగిస్తాం.. నీళ్లు ఎత్తిపోయాలని ఎన్డీఎస్ఏను కోరండి. మేమయితే.. నీళ్లు ఎత్తిపోయం.. అలా చేస్తే భద్రాచలం మునుగుతుంది. ఎన్డీఎస్ఏ గతంలో ఎన్నడూ క్షేత్రస్థాయిలో పని చేయలేదని బీఆర్ఎస్ చెబుతోంది. 2021 ఏడాదికి ముందు ఎన్డీఎస్ఏ క్షేత్ర స్థాయిలో పని చేసేందుకు చట్టం లేదు. ఆ తర్వాత మేడిగడ్డను సందర్శించి.. అందులో నీటి నిల్వ సాధ్యం కాదని చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని 3 బ్యారేజీల్లో నీరు నింపకూడదని తెలిపింది. సీడబ్ల్యూసీ, ఎన్డీఎస్ఏ అనుమతి మేరకే బ్యారేజీల పునరుద్ధరణకు యత్నిస్తాం. నీళ్లు పారుతున్నంత మాత్రాన వాటిని వినియోగించుకోలేము. పారే నీళ్లను వినియోగించుకునేందుకే బ్యారేజీలు నిర్మించారు. ఇప్పుడు బ్యారేజీలే కుంగిపోతే.. ఆ నీళ్లను ఎలా ఒడిసిపడతాము? మేడిగడ్డలో 5 టీఎంసీలు ఉంటేనే.. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నీటిని ఎత్తిపోయగలం. బ్యారేజీలు పునరుద్ధరించే వరకు గేట్లు ఎత్తి ఉంచాలని ఎన్డీఎస్ఏ ఆదేశించింది. ఒక వేళ గేట్లు ఎత్తకుండా మూసేస్తే.. బ్యారేజీలు పూర్తిగా దెబ్బతింటాయి. బ్యారేజీ గేట్లు దించకుండా.. అక్కడ నీళ్లు లిఫ్ట్ చేయడం కుదరదు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# నాన్న మరణానికి ప్రతీకారం తీర్చుకుంటా

ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ మేరకు ఆయన టెలిగ్రామ్‌లో ఓ సందేశాన్ని విడుదల చేశారు. "మా నాయకుడితో పాటు అమరులైన వారందరి కోసం.. ఆ హంతకులపై ప్రతీకారం తీర్చుకుంటాం" అని అందులో పేర్కొన్నారు. అయితే, ఈ విషయం తన నాయకత్వంపై లేదా ఇతర అధికారులపైనా ఆధారపడి లేదన్నారు. తనను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. ఇదిలాఉంటే, ఫిబ్రవరి 28 నాటి అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందగా.. జులై 9న ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. అయితే, ఆ దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా మాత్రం.. తండ్రి అంత్యక్రియల కార్యక్రమానికి హాజరుకాలేదు.

# సానుకూలంగా స్పందించింది

కాదని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చలకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపారు. ఉద్యమ సన్నాహక సమావేశం అవసరం రాదని మంత్రులు చెప్పారని బొప్పరాజు వివరించారు. పీఆర్సీ, ఐఆర్‌ల విషయంతో పాటు డీఏ, ఉద్యోగుల హెల్త్ కార్డ్ , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని కోరారు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు చనిపోయినా.. గత 8 సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు చేయట్లేదని అన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌లు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అతి త్వరలోనే ఆర్థికశాఖ మంత్రితో మరో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలు సానుకూలంగా పరిష్కరించాలనేది తమ ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోందని బొప్పరాజు వెల్లడించారు.

# ఎడిటర్ వాయిస్

## రాయలసీమ.. ఇలా రగలాల్సిందేనా..!

రాయలసీమలో రాజకీయాలు రగులుతున్నాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సీమలోని ప్రతి జిల్లా లోనూ తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్నాయి. ఇది ఎవరికి లాభిస్తుంది? ఎవరికి నష్టం చేస్తుంది ? అనే విషయాన్ని పక్కన పెడితే.. ఇలాంటి రాజకీయాలను ప్రజలు ఏమేరకు సహిస్తారన్నది కీలక అంశం. వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య తలెత్తుతున్న వివాదాలు.. చినుకు చినుకు గాలివానలా మారి.. ఉద్రిక్తతలకు.. రగడకు కూడా దారితీసింది.

**ప్రతి జిల్లాలోనూ..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాయకుల మధ్య విభేదాలు రోడ్డున పడ్డాయి. గతానికంటే భిన్నంగా నాయకు ల మధ్య సవాళ్లు-ప్రతిసవాళ్లు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా నాయకులు రోడ్డెక్కుతున్నారు. ఆళ్లగడ్డ, ఆదోని నియోజకవర్గాల్లో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ నేతల మధ్య విమర్శలు హద్దులు మీరి ఒకరిపై మరొకరు పైచేయిసాధించుకునే వరకు వెళ్లింది. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్రరెడ్డి వర్గీయులు పరస్పరం దాడులు చేసుకునే దాకా ఈ వ్యవహారం సాగుతుండడం గమనార్హం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం రావణ కాష్టంగా రగులుతూనే ఉంది. ఈ నియో జకవర్గంలోకి అడుగు పెట్టనిచ్చేది లేదని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి.. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అల్టిమేటం ఇవ్వడం.. ఇరు పక్షాల మధ్య రాజకీయాలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. తరచుగా వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. పెద్దారెడ్డిపై ఇప్పటికే పలు కేసులు నమోదు కాగా.. జిల్లా బహిష్కరణ చేయాలని జేసీ పట్టుబడుతున్నారు. ఇక, ఇదే జిల్లాలో తాజాగా మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజుకు, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డికి మధ్య వివాదాలు భగ్గుమన్నాయి. తనపై ఆరోపణలు చేశారంటూ రాజు నిప్పులు చెరుగుతున్నారు. ఈ క్రమంలోనే తోపుదుర్తి ఇంట్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కేసులు నమోదు చేశారు. ఇవి ఎంత దూరం వెళ్తాయో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే పులివర్తి నానీకి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి మధ్య కూడా ఇలానే పరిస్థితి అట్టుడుకుతోంది. పులివర్తి నానీ తీవ్ర ఆరోపణలతో చెవిరెడ్డి కుటుంబానికి సవాల్ రువ్వుతున్నారు. ఇలా.. సీమలోని అన్ని జిల్లాల్లోనూ రాజకీయాలు వేడెక్కా యనే చెప్పాలి. ఇలాంటి పరిస్థితిని పార్టీలు సర్దుబాటు చేయాలి తప్ప.. చోద్యం చూస్తే.. అది మంచిది కాదన్న అభిప్రాయం నెలకొంది. ఒకవైపు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. మరోవైపు.. ప్రభుత్వం అభివృద్ధి మంత్రం పరిస్తోంది. కానీ, క్షేత్రస్థాయిలో నాయకులు.. సవాళ్లు, ప్రతిసవాళ్ల రాజ కీయాలతో బిజీబిజీగా గడుపుతున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## రంగారెడ్డి జిల్లాలో ఆరుగురి దారుణ హత్య



**షాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి "నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నా" అని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. ఇవాళ అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.

**నిందితుడిని అప్పగించాలంటూ ఆందోళన**

ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. నిందితుడు భార్య, పిల్లలను కూడా హత్య చేయడం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురి చేసిందని సీపీ తెలిపారు.

## అమ్మా.. నీవెంటే నేను



### అర్ధగంట వ్యవధిలోనే తల్లీ తనయుడి మృత్యువాత

**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్ధగంట వ్యవధిలోనే తల్లీ కుమారుడు మృతిచెందిన ఘటన కోనసీమలో తీవ్ర విషాదం నింపింది. బాధిత బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన చిట్టూరి అపర్ణ(45) శుక్రవారం గ్యాస్ (ఉదర సంబంధ) నొప్పితో అనారోగ్యానికి గురయ్యారు. కుమారుడు సతీష్(18) తల్లిని అమ్మమ్మ సాయంతో ఆటో ఎక్కించి రావులపాలెంలోని ఓ ఆసుపత్రికి పంపాడు. ఆమె మార్గమధ్యలో ఉండగానే మృతిచెందారు. విషయం తెలియని సతీష్ ఆసుపత్రికి వెళ్లి అమ్మకు సపర్యలు చేద్దామని బయలుదేరుతుండగా మనోవ్యథకు గురై ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందాడు. అర్ధగంట వ్యవధిలోనే తల్లీ తనయుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలకు అంతులేకుండా పోయింది. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. సతీష్ పశ్చిమ్‌బంగలోని ఎన్ఐటీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సెలవులు ఇవ్వడంతో ఇటీవల ఇంటికి వచ్చాడు. తల్లి అపర్ణ ఇంట్లో ఎంబ్రాయిడరీ పనులతో పాటు పిండిమర ఏర్పాటు చేసుకుని వచ్చే సొమ్ముతో కుమారులిద్దరినీ చదివిస్తోంది. భర్త కరోనా సమయంలో మృతిచెందారు. చిన్న కుమారుడు చిన్ను రాజమహేంద్రవరంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇంక తనకు దిక్కెవరంటూ ఆ విద్యార్థి రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. అంత్యక్రియలను గ్రామస్థులు, బంధువుల అశ్రునయనాల మధ్య ఇద్దరికీ ఒకేసారి నిర్వహించారు. ఈ ఘటనతో గ్రామమంతా విషాదంలో నిండిపోయింది.

## బ్యాంకులో నగలు కాజేసిన ఇంటిదొంగ

### గోల్డ్ అప్రైజరే నిందితుడు.. రూ.5.80 కోట్ల సొత్తు స్వాధీనం



**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం బ్యాంకు ఆఫ్ బరోడా బ్యాంకు బ్రాంచిలో ఇటీవల రూ.10 కోట్ల విలువైన 6.449 కిలోల బంగారం మాయమైన కేసును పోలీసులు ఛేదించారు. ఏలూరులో శుక్రవారం ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ వివరాలు వెల్లడించారు. 'బ్యాంకులో మొత్తం 176 బంగారు రుణాల ఖాతాలకు సంబంధించిన ఆభరణాలు మాయమైనట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంకులోని గోల్డ్ అప్రైజర్ చలపాక రాజు దఫదఫాలుగా నగలను కాజేసి, వాటి స్థానంలో నకిలీవి ఉంచాడు. కాజేసిన నగలను వర్తకులకు విక్రయించాడు. నిందితుడి నుంచి రూ.5,81,65,000 విలువైన 4.120 కిలోల నగలను స్వాధీనం చేసుకున్నాం. నిందితుడికి ఐదుగురు బ్యాంకు ఉద్యోగులు సహకరించినట్లుగా తెలిసింది' అని ఎస్పీ వెల్లడించారు.

## చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

### బస్సు ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు – నలుగురికి గాయాలు




**చిలకలూరిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని పసుమర్తి వద్ద శనివారం ఉదయం తీవ్ర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ప్రయాణిస్తున్న ఓ కారును ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన వేగానికి కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైపోగా, ప్రమాదం జరిగిన క్షణాల్లో అక్కడ తీవ్ర కలకలం నెలకొంది. ప్రమాద సమయంలో కారులో ఉన్న నలుగురు ప్రయాణికులు గాయపడగా, స్థానికులు వెంటనే స్పందించి వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. వైద్యుల ప్రాథమిక పరీక్షల ప్రకారం గాయపడిన వారిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. దెబ్బతిన్న కారును రోడ్డు పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి దారితీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. అతివేగమా... డ్రైవర్ నిర్లక్ష్యమా... లేక మరేదైనా కారణమా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.



# విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు



కాకినాడ జిల్లా



తూర్పు గోదావరి జిల్లా



డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా



ఆదివారం, 12 జూలై, 2026





www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత www.viswamvoice.com


# అమలాపురంలో ఘోరం: భర్తపై యాసిడ్ తో దాడి చేసిన భార్య!

- బాత్రూమ్ క్లీనింగ్ యాసిడ్‌తో నిద్రపోతున్న సమయంలో ఘాతుకం?
- ఒళ్లంతా కాలి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో భర్తకు చికిత్స
- నిందితురాలు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ దుర్గాభవాని.. ఐదేళ్ల క్రితమే వివాహం, ఇద్దరు పిల్లలు
- గతంలోనూ దాడులు చేసిందంటున్న బాధితుడు.. తక్షణమే అరెస్ట్ చేయాలని బంధువుల డిమాండ్



**అమలాపురం, విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్:**

పవిత్రమైన వివాహ బంధంలో ఘోరం జరిగింది. క్షణికావేశమో, కుటుంబ కలహాలో తెలియదు గానీ.. తోడుండాల్సిన భార్యే భర్తపై కిరాతకానికి ఒడిగట్టింది. కట్టుకున్న భర్తపై యాసిడ్ పోసి ప్రాణాల మీదకు తెచ్చిన దారుణ ఘటన అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో తీవ్ర కలకలం రేపింది. నమ్మినవాడే నడిసముద్రంలో ముంచాడనే సామెతను నిజం చేస్తూ, ఒక నర్సుగా ప్రాణాలు కాపాడాల్సిన చేతులతోనే భర్తపై యాసిడ్ దాడికి పాల్పడటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**అసలేం జరిగిందంటే..?**

పోలీసులు, బాధితుడి బంధువుల కథనం ప్రకారం.. ముమ్మిడివరం మండలం, తానేలంక గోపాలరావుపేటకు చెందిన పూలపకూరి అర్జున్ కుమార్‌కు, దుర్గాభవానికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. దుర్గాభవాని అమలాపురం ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ బేసిస్ మీద స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. వివాహమైన కొంతకాలం పాటు వీరి కాపురం సజావుగానే సాగినప్పటికీ, గత కొంతకాలంగా దంపతుల మధ్య తరచూ తీవ్రమైన గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శనివారం వీరి మధ్య వివాదం ముదిరింది. తీవ్ర ఆగ్రహానికి లోనైన దుర్గాభవాని.. ఇంట్లో బాత్రూమ్ క్లీనింగ్ కోసం వాడే యాసిడ్‌ను తీసుకొచ్చి భర్త అర్జున్ కుమార్ శరీరంపై గుమ్మరించింది.

**తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు**

యాసిడ్ దాడిలో అర్జున్ కుమార్ ఒళ్లంతా తీవ్రంగా కాలిపోయింది. ఆయన పెట్టిన కేకలు విన్న స్థానికులు, బంధువులు వెంటనే స్పందించి, బాధితుడిని చికిత్స నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నారు. కాగా, బాధితుడి పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని ఆసుపత్రి వైద్యులు మీడియాకు తెలిపారు.

**గతంలోనూ దాడి చేసింది: బాధితుడి ఆరోపణ**

భార్య దుర్గాభవాని సైకోలా ప్రవర్తించేదని, తమ మధ్య గొడవలు జరిగిన ప్రతిసారీ తనపై దాడికి తెగబడేదని బాధితుడు అర్జున్ కుమార్ ఆసుపత్రి బెడ్‌పై నుంచి ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో కూడా ఆమె తనపై భౌతిక దాడికి పాల్పడిందని, ఇప్పుడు ఏకంగా యాసిడ్ పోసి చంపాలని చూసిందని ఆరోపించాడు.

**ఎమ్మెల్సీ కేసు నమోదు.. అరెస్ట్‌కు బంధువుల డిమాండ్**

యాసిడ్ దాడి బాధితుడు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చేరడంతో, వైద్యుల సమాచారం మేరకు పోలీసులు మెడికో లీగల్ కేస్ నమోదు చేశారు. విషయం తెలుసుకున్న అర్జున్ కుమార్ బంధువులు ఆసుపత్రికి భారీగా చేరుకున్నారు. కట్టుకున్న భర్తపైనే ఇంతటి అమానుషానికి ఒడిగట్టిన దుర్గాభవానిని పోలీసులు తక్షణమే అదుపులోకి తీసుకుని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు.

**అసలేం జరిగిందంటే..?**

- అర్జున్ కుమార్ – దుర్గాభవాని దంపతులది ఐదేళ్ల క్రితం వివాహం.
- వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.
- దుర్గాభవాని అమలాపురం ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తోంది.
- ఇటీవల దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.
- ఈ రోజు నిద్రపోతున్న భర్తపై యాసిడ్‌తో దాడి చేయడంతో ఒళ్లంతా కాలి గాయాలయ్యాయి.
- నిందితురాలను వెంటనే అరెస్ట్ చేయాలని బాధితుడి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.
- పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**హింస కాదు – పరిష్కారం సంభాషణ: కుటుంబాల్లో శాంతి – సమాజానికి బలం**

## ప్రతి అంబులెన్స్(108)లో పాముకాటుకు మందు

### గ్రామీణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామీణ ప్రజలకు మరి ముఖ్యముగా రైతులకు, కూలి పని చేసుకునే వాళ్లకు ఎదురయ్యే ప్రమాదాలలో ముఖ్య మైనది పాము కాటు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ప్రజలకు ఎదురయ్యే విష సర్పాలలో 1. నాగుపాము,2. రక్త పింజరి,3. కట్లపాము ఈ మూడు పాములలో ఏది కాటు వేసిన గంటలోపే మందు పడకపోతే మనిషి ప్రాణం పోతుంది కనుక ప్రభుత్వం మంచి ఆలోచన చేసి మారుమూల గ్రామాల ప్రజలకు సరైన సమయంలో సదుపాయాలు లేక అందు బాటులో పాము కాటుకు మందులు దొరకక ప్రాణాలు కోల్పోతున్నారు. కావున ప్రభుత్వం మంచి ఆలోచనతో ఇకనుండి ప్రతి అంబులెన్స్ లో (108) వాహనంలో పాముకాటుకు మందులు ఉంచడం జరుగుతుంది, ఏ ఒక్కరికి ఏ సమయంలో ప్రమాదం జరిగిన కొద్ది నిమిషాలలో 108 వాహనం అక్కడకు వస్తుంది. సహజంగా108 వాహనంలో కేవలం యాక్సిడెంట్ సంబంధించిన సదుపాయాలు మాత్రమే ఉంటుంది. కానీ ఇప్పుడైతే ప్రభుత్వం మంచి ఆలోచన చేసి గ్రామీణ ప్రజలు పాము కాటుకి బలి అవ్వకూడదనే మంచి ఆలోచనతో పాము కాటుకు మందు కూడా 108 వాహనంలో ఉంచడం జరిగిందన్నారు. కావున గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## ప్రజలతో మమేకమే ప్రజా సమస్యలపై దృష్టి సారించండి : బొడ్డు

### -పార్టీ కార్యాచరణపై సమీక్ష



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించుకుందామని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. శనివారం బూరుగుపూడి గేట్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలతో "సర్"కార్యక్రమం పై సమీక్షించి, ఓటర్లకు సహకరిస్తూ 18 సంవత్సరాలు పూర్తయిన వారికి నూతన ఓట్ల నమోదును పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రీవెన్స్ నిర్వహించి గ్రామాల్లో సమస్యలపై పలు వినతులు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో రానున్న ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని నాయకులంతా ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యల పరిష్కారానికి శుద్ధితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలు విద్యార్థి భవిష్యత్తును నాశనం చేస్తాయి

### సిఐ పి.దొరరాజు



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** మాదక ద్రవ్యాలు వల్ల విద్యార్థి భవిష్యత అంధకారంలో వెళ్తుందని మండపేట రూరల్ సిఐ దొరరాజు పేర్కొన్నారు.ద్వారపూడి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో శనివారం ర్యాగింగ్ నిరోధక మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండపేట రూరల్ సీఐ పి దొరరాజు, ఎస్ఐ వి కిశోర్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చేస్తే కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక, సామాజిక సమస్యలు వస్తాయని సి ఐ దొరరాజు వివరించారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, గురువుల సూచనలు పాటించి మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ర్యాగింగ్ లేదా డ్రగ్స్ గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జె ప్రసాద్, కానిస్టేబుల్ వంశీ, వసతి గృహ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### ఎస్ఐఆర్‌పై వైయస్సార్ పార్టీ సమీక్ష సమావేశం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గం వైయస్సార్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పై అప్రమత్తతతో వ్యవహరించే విధి విధానాల కొరకు నియోజకవర్గం బూత్ కమిటీ ఇంచార్జ్ పోతుల దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మూడు రోజులే ఉన్నాయి కాబట్టి ప్రతి ఓటు చాలా కీలకమని, ఓటర్ జాబితా తనిఖీ చేసి మీ బూత్ లెవెల్ లో ఉన్న ప్రతి ఓటు ఉందా లేదా అనేది ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసుకోవాలని ఏదైనా పొరబాటు జరిగితే మీ బిఎల్ఓ ల దృష్టికి తీసుకుని వెళ్ళి సరిచేసుకోవాలన్నారు. అప్పటికి మీరిచ్చిన పిర్యాదులను పరిష్కరించకపోతే పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వార్ రూం కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మరో ముఖ్య అతిథి జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు చీకట్ల కిషోర్ మాట్లాడుతూ ప్రతి వార్డు, గ్రామాలలో నియమించిన బూత్ లెవెల్ మానిటరింగ్ కమిటి సభ్యులతో కలసి ఇంకను డిజిటలైజేషన్ పూర్తికాని ఓట్లను పరిశీలించి నమోదు చెయ్యాలని సూచించారు. మండపేట నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు ఒంటెద్దు వెంకన్నాయుడు మాట్లాడుతూ ప్రతి బూత్‌లో అనుమానాస్పద తొలగింపులు జరగకుండా ఏజెంట్లతో కలిసి పార్టీ ప్రెసిడెంట్లు అందరూ సమైక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ మండలాల బూత్ లెవెల్ ఇన్చార్జిలు సూరంపూడి సత్యప్రసాద్, ఏలేటి గంగరాజు, పోతంశెట్టి సత్యనారాయణ రెడ్డి, రాయవరం మండపేట పార్టీ అధ్యక్షులు వెలగల సత్యనారాయణరెడ్డి, అడబాల బాబ్జి, జిల్లా ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, ఐటి వింగ్ అధ్యక్షులు యరమాటి వెంకన్నబాబు, బూత్ లెవెల్ ఏజెంట్లు, పార్టీ వార్డు ప్రెసిడెంట్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


విశ్వం వాయిస్

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.

# సాగునీరు అందక నారుమడులు ఎండిపోతున్నాయి

వ్యవసాయ కార్మిక సంఘం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం చెందాడుగరువు గ్రామంలో సాగునీరు అందక నార్లు ఎండిపోతున్న పరిస్థితిపై వ్యవసాయ కార్మిక సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రోజు (శనివారం) వ్యవసాయ కార్మిక సంఘం బృందం గ్రామంలోని ఎండిపోయిన నారుమడులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, మరియు రైతు సంఘాల సమన్వయ సమితి అంబేద్కర్ కోనసీమ జిల్లా కో- కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతాంగానికి సాగునీరు అందించడంలో ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, వారి నిర్లక్ష్య వైఖరి వల్లే నేడు ఈ పరిస్థితి దాపురించిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇరిగేషన్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందులకు గల ప్రధాన కారణాలను ఆయన మాట్లాడుతూ

**శివారు గ్రామాలకు అందని నీరు :** అభివృద్ధి పనుల పేరుతో కాలయాపన చేయడం వల్ల, అభివృద్ధి పనులకు సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల నేటికీ సాగునీరు శివారు గ్రామాలకు చేరడం లేదు. మేము అభివృద్ధి పనులను అడ్డుకోవడం లేదు కానీ, ఆ పనుల వల్ల రైతులకు సాగునీరు అందకుండా పోవడం అధికారుల ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. జిల్లాలో సాగునీటి డ్రైన్లు విచ్చలవిడిగా ఆక్రమణలకు గురవుతున్నా, వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇరిగేషన్ అధికారులు ముద్దునిద్ర పోతుండటం వల్లే సాగునీటి సరఫరా సజావుగా సాగడం లేదు అన్నారు.

**పూడికతీత లేని పంట కాలువలు:** జిల్లాలోని ఇరిగేషన్ డ్రైనేజీలు, పంట కాలువలు, పిల్ల కాలువలు అన్నీ పూడికలతో నిండి పోయాయి. వీటిని శుభ్రం చేయడంలో ప్రభుత్వం కనీస శ్రద్ధ చూపడం లేదు.

**అధికారుల అవగాహన రాహిత్యం:** ఇరిగేషన్ శాఖ అధికారులకు క్షేత్రస్థాయి పరిస్థితులపై కనీస అవగాహన లేదు. కాలువల మరమ్మతులు, పూడికతీత పనులను సకాలంలో చేపట్టే ప్రయత్నం చేయకపోవడం వల్లే నేడు నార్లు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ అధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, తక్షణమే స్పందించాలి. యుద్ధప్రాతిపదికన కాలువల పూడికతీత పనులు చేపట్టి, ఆక్రమణలను తొలగించి, చెందాడుగరువు లాంటి శివారు గ్రామాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల సమావేశం సమితి డిమాండ్ చేశారు. నీరు అంబికా నారు ముళ్ళు వేసి నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని తక్షణం శివారి గ్రామాలన్నింటికీ నీరు అందించే తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ పరిశీలన బృందంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పశ్చిమాల శివ, రైతులు పి.చిన్న పేరయ్య, పొనకల సూరిబాబు, పొనకల శ్రీను, మట్టా రాజు, మట్టా విజయకుమార్, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంత్యోదయ రేషన్ కార్డుల రద్దును వెంటనే నిలిపివేయాలి

## ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంత్యోదయ రేషన్ కార్డులను రద్దు చేయడం వల్ల అత్యంత పేద, నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతాయని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. గురువారం అమలాపురం యుటిఎఫ్ హోమ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డి.రమాదేవి మాట్లాడుతూ అంత్యోదయ కార్డులు ఆహార భద్రతకు ఆధారంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయడం వల్ల పేద కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులందరికీ కార్డులను కొనసాగించి, ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు అన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అంత్యోదయ కార్డుల రద్దు నిర్ణయాన్ని వెంటనే పునఃపరిశీలించి, రద్దైన కార్డులను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజల హక్కులను కాపాడేందుకు అవసరమైతే ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆహార భద్రత అనేది రాజ్యాంగంలో కల్పించబడినటువంటి హక్కు అని ఈ హక్కునికి భంగం కలిగిస్తూ ఈరోజు మోడీ జీవో పాస్ చేయడం అనేది పేద ప్రజలకి నష్టం అందులో పేదల్లోనూ అత్యధిక శాతం దళితులు మహిళలు ఎక్కువ మంది వ్యవసాయ కూలీలుగా ఉన్నటువంటి పరిస్థితుల్లో అంత్యోదయ కార్డులు కొనసాగించాలని కోరారు. గత కాంగ్రెస్ యూపీఏ 1 ప్రభుత్వంలో తీసుకొచ్చినటువంటి అంత్యోదయ రేషన్ కార్డు ఆ పథకాన్ని రద్దు తీసుకొచ్చినటువంటి దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం ఈరోజు దేశ వ్యాప్తంగా కొన్ని లక్షల మంది నేటికీ తిండి లేక ఇబ్బందులు పడుతున్నటువంటి పరిస్థితులు పేదరిక నిర్మూలన చేయకుండా ప్రవేశపెట్టినటువంటి పథకాలను రద్దు చేయడం అంటే హాస్యాస్పదం అన్నారు దేశ వ్యాప్తంగా అనేకమంది నేటికీ ఆకలితో చనిపోతున్నటువంటి కుటుంబాలు ఉన్న నేపథ్యంలో రేషన్ పథకాన్ని రద్దు చేయడానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామని రాబోయే కాలంలో ఈ పథకాన్ని కొనసాగించడం కోసం ప్రజా సంఘాలు కలుపుకుని ఉద్యమం తీవ్రతరం చేస్తానని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు ఐ.మంగాదేవి ప్రజాసంఘాలు నాయకులు బుంగ సత్యనారాయణ, గోపాలన్ పాము బాలయ్య, దైవ కృప, అమూల్య, బలరాం తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో వైభవంగా

# శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీ బాలా త్రిపురసుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవం నిన్న రాత్రి 8 గంటలకు అత్యంత వైభవంగా జరిగింది. కన్నుల పండువగా జరిగిన ఈ కళ్యాణ వేడుకను తిలకించడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాలు మొత్తం ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెరుకుపల్లి గణేష్ శర్మ, ఆలయ ఈఓ సీహెచ్ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు సుతాపల్లి వీరబాబు, శాఖ వీరన్న కాపు, ఆదివరపు దుర్గాప్రసాద్, మన్ని బద్రి, గిరి, సత్యవాడ శ్రీహరి పంతులు, గొల్లపల్లి కృష్ణ, కోట వెంకటరమణ మూర్తి తదితరులతో పాటు పట్టణ పురోహితులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్

# 75వ ఆవిర్భావ దినోత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ఏపీఎస్ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీసు ఆవరణలో యూనియన్ 75వ ఆవిర్భావ దినోత్సవం (వజ్రోత్సవ వేడుకలు) అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యూనియన్ కార్యదర్శి ఆర్వీఎస్ మన్యం ముఖ్యఅతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. వజ్రోత్సవ వేడుకల సందర్భంగా నాయకులు మరియు కార్మికులు యూనియన్‌తో తమకున్న అనుభవాలను నెమరువేసుకున్నారు. కార్మిక సోదరుల సంక్షేమం కోసం ఎంప్లాయీస్ యూనియన్ చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి నాయకులు వారికి వివరించారు. అనంతరం యూనియన్ నాయకులు కేక్ కట్ చేసి, సిబ్బందికి స్వీట్లు, కూల్ డ్రింక్స్ పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో రామచంద్రపురం డిపో ప్రెసిడెంట్ డి.ఎం. రావు, డిపో కార్యదర్శి వి.ఎల్. నారాయణలతో పాటు అధిక సంఖ్యలో కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది మరియు కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రతి అర్హుడి పేరు

# ఓటరు జాబితాలో ఉండాలి

## సమగ్ర సర్వేపై బీజేపీ నాయకుల అవగాహన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో బీజేపీ నాయకులు విస్తృతంగా పర్యటించారు. జూలై 14వ తేదీతో సమగ్ర సర్వే ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో, బీజేపీ మండల అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు, అప్పన రాజశేఖర్ తదితర నాయకులు, కార్యకర్తలు మండలంలోని ద్రాక్షారామ, హసన్ బాద తదితర గ్రామ పంచాయతీల్లో పర్యటించి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బూత్ లెవెల్ అధికారులతో (బీఎల్ఓ) మాట్లాడి సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సమగ్ర సర్వే ప్రాముఖ్యతను వివరించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు కావాలంటే అవసరమైన పత్రాలను సమర్పించి జూలై 14 లోపు ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అవగాహన కల్పించారు. గడువు సమీపిస్తున్నందున సెలవు దినాల్లో సైతం ప్రజలకు సేవలందిస్తున్న బీఎల్ఓలను ఈ సందర్భంగా నాయకులు అభినందించారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసి, తద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ద్రాక్షారామ పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యన్నారాయణ, వీఆర్వో కె. పరంజ్యోతి, ఉండూరు వీఆర్వో చరణ్, ద్రాక్షారామ బీఎల్ఓలు అముజూరు వెంకటేశ్వరరావు, కాకర్ల దుర్గా ప్రసాద్, సురేష్, హసన్ బాద బీఎల్ఓలు లలిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ఓటరు ధృవీకరణలో

# పాల్గొన్న పాముల రాజేశ్వరి దేవి



**మలికిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లి గుబ్బలపాలెం, పడమటిపాలెం గ్రామాల్లో సమగ్ర ఓటరు జాబితా పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పాముల రాజేశ్వరి దేవి పర్యటించి ఓటరు ధృవీకరణ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు ధృవీకరణ ప్రక్రియను గడువులోపు పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో చింత ప్రసాద్, రాజోలు నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు విప్పర్తి మహేష్, మలికిపురం మండల బూత్ కమిటీ అధ్యక్షుడు కలిగితి కార్తీక్, గుబ్బలపాలెం గ్రామశాఖ నాయకులు ఎల్లమెల్లి రామారావు, ముడకల బాబురావు, ఎల్లమెల్లి త్రిమూర్తులు, పడమటిపాలెం గ్రామశాఖ నాయకులు మంద సత్యనారాయణ, నల్లి శరత్, తాడి సుధీర్, బూసి నరేష్, తాడి శ్రీను, తాడి సత్యనారాయణ, యడ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కోనసీమ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా నాగబాబు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారిగా ఓలేటి నాగబాబు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడపనిచేస్తున్న డి. హరి శేషుతూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ముమ్మిడివరంలోపనిచేస్తున్న నాగబాబుకు జిల్లా అధికారి బాధ్యతలు ఇచ్చారు. అనంతరం నాగబాబు జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వహీద్‌ను కలిశారు.

# మాజీ ఎంపీ బుచ్చిబాబును పరామర్శించిన ఎమ్మెల్యే చినరాజప్ప



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ ఎ.జె.వి. బుచ్చి మహేశ్వరరావును పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప శనివారం స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా బుచ్చి మహేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల నుంచి చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు చినరాజప్ప తనయుడు రంగనాగ్, గెడ్డం సురేష్ బాబు, గంగుమళ్ల శ్రీనివాస్, అబ్బిరెడ్డి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురంలో 81.27 శాతం సర్ డిజిటలైజేషన్ పూర్తి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పురపాలక సంఘం పరిధిలో ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో శనివారం ఉదయం నాటికి 81.27 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయినట్లు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు, 41,121 మంది ఓటర్లు ఉన్నారని, వారందరికీ బీఎల్‌వోల ద్వారా 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు శనివారం, ఆదివారం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాల్లో బీఎల్‌వోలు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి ఓటరు ఈ నెల 14వ తేదీలోపు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించి డిజిటలైజేషన్ ప్రక్రియకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 81 శాతం డిజిటలైజేషన్ పూర్తికావడం అభినందనీయమన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు ప్రతి ఓటరికి ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను వివరించి, 100 శాతం డిజిటలైజేషన్ లక్ష్య సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, బీఎల్‌వోలు, మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు కార్యదర్శులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం జాతీయ లోక్ అదాలత్‌లో

# విజయవంతంగా 343 కేసుల పరిష్కారం




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం 13వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్ర మంలో భాగంగా మొత్తం 343 సివిల్ మరియు క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు జడ్జి శ్రీమతి బి.హెచ్.వి. లక్ష్మీకుమారి తెలియజేశారు. పరిష్కారమైన ఈ కేసుల మొత్తం విలువ రూ. 2,83,29,123 (రెండు కోట్ల ఎనభై మూడు లక్షల ఇరవై తొమ్మిది వేల నూట ఇరవై మూడు రూపాయలు) ఉంటుందని ఆమె వెల్లడించారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి హాజరైన సుమారు 300 మందికి పైగా కక్షిదారులకు మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తిరుమల రావు పాల్గొన్నారు. వారితో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లావరాజు, సెక్రటరీ నీలం మధుసూదన్ రావు, మాజీ అధ్యక్షుడు పిల్లి మురళి మోహన వెంకటరమణ, ఇతర కార్యవర్గ సభ్యులు, లోక్ అదాలత్ బెంచ్ సభ్యులు పలివెల సత్యనారాయణ, జుత్తుక నాగేశ్వరరావు, బండి శ్రీనివాస్ మరియు పలువురు న్యాయవాదులు, కక్షిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామచంద్రపురం నియోజకవర్గ మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ యూనియన్ బ్యాంక్- అమలాపురం మరియు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సహకారంతో రామచంద్రపురం నియోజకవర్గ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ (టైలరింగ్) శిక్షణను అందించనున్నారు. ఒక నెల రోజుల పాటు జరగనున్న ఈ ఉచిత శిక్షణా కార్యక్రమానికి ఆసక్తి గల మహిళల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులు ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడతాయి. శిక్షణకు వచ్చే ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ఉచిత భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమ ఆధార్ కార్డ్, 10వ తరగతి మార్కుల జాబితా, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులు సమర్పించాలనుకునే వారు రామచంద్రపురం మెయిన్ రోడ్డులో, ఆర్డీఓ కార్యాలయం పక్కన ఉన్న 'మహిళా అభ్యుదయ వేదిక, టౌన్ హాల్' నందు అందజేయాల్సి ఉంటుంది. ఈ ఉచిత శిక్షణకు సంబంధించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలనుకునే వారు 96428 41444 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# సర్‌కు సహకారం.. ఓటు హక్కు పదిలం

## నోటీసులిచ్చాకే అనర్హుల తొలగింపు : కలెక్టర్ హరేంధిరప్రసాద్

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ గడువు సమీపిస్తున్నందున జిల్లా ఓటర్లంతా బీఎల్వోలకు సహకరించి తమ హక్కును కోల్పోకుండా చూసుకోవాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ కోరారు. ఓటర్లు కొందరు ఇంకా అపోహలతో వారి వివరాలను బీఎల్వోలకు ఇవ్వడానికి రావడం లేదన్నారు. దీనివల్ల ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్‌లో జాప్యం జరుగుతుందన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించడం జరగదని, అనర్హులుంటే వారికి నోటీసులు ఇచ్చిన తర్వాతనే తుది జాబితా నుంచి తొలగిస్తామన్నారు.



**68 శాతం డిజిటలైజేషన్**

2025 ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో 16.55 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేశాం. కొందరు చనిపోగా.. డూప్లికేట్, శాశ్వత వలస ఓటర్లూ ఉన్నారు. తిరిగి 10.16 లక్షల మంది నుంచి వివరాలతో కూడిన పత్రాలను బీఎల్వోలు సేకరించి డిజిటలైజేషన్ చేశారు. 68 శాతం పూర్తయింది. ఈనెల 14లోగా అన్ని పత్రాలు డిజిటలైజేషన్ జరగాలి. బీఎల్వోలు అడిగిన సమాచారం ఓటర్లు ఇస్తే సాఫీగా 'సర్' సాగిపోతుంది.

**2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ తప్పనిసరి..**

ఓటర్లు 2002లో తాము ఏ ప్రాంతంలో ఓటు వేశారో సమాచారమివ్వాలి. వాటితో ప్రస్తుత జాబితాను మ్యాపింగ్ చేస్తారు. అప్పటికి ఓటు లేకుంటే తమ తల్లిదండ్రులు, తాత ముత్తాతల వివరాలైనా చెప్పాలి. లేకుంటే ఎన్యూమరేషన్ అసంపూర్తిగా నిలిచినట్లే. డిజిటలైజేషన్ పూర్తయిన ఓటర్ల సంఖ్యలో మూడు నుంచి నాలుగు శాతం మ్యాపింగ్ జరగలేదు. వారి ఓట్లను ఈనెల 21న ప్రచురించే ముసాయిదా జాబితా వరకు ఉంచుతాం. తర్వాత నోటీసులిచ్చి ఆధారాలు కోరతాం. 14 రకాల గుర్తింపుకార్డుల్లో ఏ ఒక్కటి చూపినా చాలు. అలా చూపనివారి వివరాలను సెప్టెంబర్‌లో ప్రచురించే తుది జాబితా నుంచి తొలగిస్తాం.

**స్వర్ణ వార్డు, గ్రామ సచివాలయాల్లో వివరాలు..**

'బీఎల్వోలు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీకి, తిరిగి తీసుకోవడానికి ఓటర్ల ఇళ్లకు మూడుసార్లు వెళ్లాల్సి ఉంటుంది. ఓటర్లు అందుబాటులో లేకుంటే నేరుగా స్థానిక స్వర్ణ వార్డు, గ్రామ సచివాలయాలకు వచ్చి వివరాలివ్వవచ్చు. తాత్కాలికంగా అక్కడ లేనివారు, వెబ్‌సైట్‌పై అవగాహన ఉన్నవారు voter.eci.gov.in ద్వారా ఎన్యూమరేషన్ పత్రాలను సమర్పించవచ్చు. ముసాయిదా జాబితాలో తప్పుగా ఎవరి ఓటైనా తొలగింపునకు గురైతే ఆ వచ్చే నెలరోజుల వ్యవధిలో ఈఆర్వో వద్ద క్లెయిమ్ చేసుకుని తుది జాబితాలో చేర్చుకోవచ్చు.' అని తెలిపారు.

# యూరియా సప్లైలో కూటమి పూర్తి విఫలం

### కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ఆగ్రహం



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా రైతు లకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందుతోందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు విమర్శించారు. మండపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం యాప్ ద్వారా ఎరువులు పంపిణీ చేస్తామని చెప్పడం దారుణమని ఆరోపించారు. రైతుల్లో ఎక్కువమంది నిరక్షరాస్యులు ఉంటారని, పైగా చాలా మంది స్మార్ట్‌లు ఫోన్ లే ఉండవని పేర్కొన్నారు. అటువంటి వారికి ఎరువులు తెచ్చుకోవడం చాలా ఇబ్బందిగా మారుతుందన్నారు. తక్షణం ఈ యాప్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసి పాత పద్దతి లో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం ఎత్తివేసిందనీ, అలాగే ఇన్ పుట్ సబ్సిడీ కూడా ఇవ్వడం లేదని ఇప్పుడు యాప్ ల పేరుతో ఎరువులు కూడా దూరం చేస్తే ఎలా అని మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలని కామన డిమాండ్ చేశారు.

### సీతానగరం మండలంలో పలువురు లబ్ధిదారులకు

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురికి శాసనసభ్యులు బత్తుల బల రామకృష్ణ ఆదేశాల మేరకు వారి సతీమణి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సిఎం ఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. సింగవరం గ్రామానికి చెందిన జి.లక్ష్మికి రూ.42449/-లు,చిట్రోతు ప్రసాదరావుకు రూ 31,8431-లు,ఐలేటి శ్రీనుకు రూ 15,010/- లు,సీతానగరం గ్రామానికి చెందిన కాశి వీర వేణికి రూ 23,400/-లు,రఘుదేవపురానికి చెందిన బండారు గంగాభవానికి రూ. 42,746/-లు,కాప వెంకటేశ్వరరావుకు 43,824/లు, వంగలపూడి గ్రామానికి చెందిన సలాది గీతాంజలికి రూ.35377/-లు,సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్వయంగా వెళ్లి అందించారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు వారి సతీమణి వెంకటలక్ష్మికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# లాభాల పేరుతో రూ.37 కోట్ల మోసం

### 'జెనిసిస్' కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

### వరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ కిషోర్‌కుమార్, సర్పవరం సీఐ



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టిస్తామని, ప్రతినెలా స్థిరమైన లాభాలు అందిస్తామని నమ్మబలికి పలువురిని మోసం చేసిన కేసులో కాకినాడ వలసపాకలకు చెందిన పులుగు మోజేష్, గాంధీనగర్‌కి చెందిన సంధనా లలితఅంబికలను సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 6 ల్యాప్‌టాప్‌లు, 4 చర వాణులు, ఒక కారు, బాండ్‌లు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాకినాడ స్పెషల్ మొబైల్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. సర్పవరం పోలీసుస్టేషన్‌లో ఏఎస్పీ అడ్మిన్ డా.మహంతి కిషోర్‌కుమార్, సర్పవరం సీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. పులుగు మోజేష్ కాకినాడ డీఎస్ఏ స్టేడియం ఎదురుగా ఉన్న కేఆర్‌కే ప్లాజాలో ఆల్‌మైటీ జెనిసిస్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశారు. స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడతామని, రూ.లక్ష కడితే నెలకు రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. దీంతో చాలామంది ఆశతో డబ్బులు కట్టారు. ముందుగా కట్టిన వారికి సొమ్ములు బాగానే ఇచ్చారు. దీంతో చాలామంది పెట్టుబడులు పెట్టారు. ఆ తర్వాత నిందితులు బోర్డు తిప్పేశారు. దర్యాప్తులో మొత్తం పెట్టుబడిదారుల సంఖ్య 7,342గా తేలింది. గత నెల జూన్ 30కి వాటిలో 3,709 ముగియగా, ఇంకా కొనసాగుతున్న వారి సంఖ్య 3,633గా గుర్తించారు. మొత్తం పెట్టుబడి రూ.98,66,92,943 కాగా కొనసాగుతున్న వారి మొత్తం రూ.53,87,72,943 అని తేల్చారు. గత నెల 30 నాటికి లాభాలతో కలిపి చెల్లించిన మొత్తం రూ.16,13,66,096 కాగా, ఇంకా బాధితులకు రూ.37,74,06,847 చెల్లించాల్సి ఉంది.

**బాధితులు సాక్ష్యాలతో రావాలి**

ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఎంత పెట్టుబడులు పెట్టారో తెలిపే సాక్ష్యాలతో వస్తే న్యాయం చేస్తామని ఏఎస్పీ మహంతి కిషోర్‌కుమార్ తెలిపారు. నిందితులు ఆస్తులు ఏమైనా కొన్నారా, ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. గతంలో మోజేష్‌పై సర్పవరం పోలీసుస్టేషన్‌లో ఒక కేసు నమోదయ్యిందని, లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకున్నారన్నారు. దర్యాప్తులో భాగంగా వీరు హైదరాబాద్‌లో ఒక బ్రాంచి తెరిచారని తేలిందని, ప్రస్తుతం అక్కడ కార్యకలాపాలు లేవని చెప్పారు. సంస్థ ఉద్యోగులకు ఈ కేసులో సంబంధం ఉందని తేలితే వారిని నిందితులుగా చేర్చుతామన్నారు. ఎవరైనా స్థిరమైన లాభాలు ఇస్తామని చెబితే ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఘటనలో కొంతమంది పోలీసులు బాధితులకు ఏం కాదని చెబుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

# అన్నవరంలో పోటెత్తిన భక్తజనం



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నవరం సత్యదేవుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. వరుస సెలవు రోజులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు స్వామి దర్శనానికి వచ్చారు. ఉదయం 8 గంటల నుంచి అంతకంతకు రద్దీ పెరిగింది. క్యూలైన్లు, వ్రతమండపాలు కిక్కిరిసిపోయాయి. దర్శనానికి సుమారు రెండుగంటల సమయం పట్టింది. సుమారు రెండుగంటలు అంతరాలయం దర్శనాన్ని నిలుపుదల చేశారు. సాధారణ క్యూలైన్లలోనే అనుమతించారు. ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. వందలాది వాహనాలను సత్యగిరిపై పార్కింగ్ ప్రదేశానికి మళ్లించారు. అక్కడ నుంచి భక్తులను దేవస్థానం ఉచిత బస్సుల్లో ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చారు. వసతిగదులకు డిమాండ్ ఏర్పడింది.

# జానూ కోసం నాన్న ప్రయత్నం



**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని మండలం సీహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి జాడ తెలియక తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. చిన్నారి అదృశ్యమై 35 రోజులైనా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు పోలీసులు దర్యాప్తు చేస్తుండగా, మరో వైపు తండ్రి గ్రామాల్లో తిరుగుతూ చిట్టితల్లి కోసం అన్వేషిస్తున్నాడు. పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో మకాంల వద్దకు వెళ్లి ఆరా తీస్తున్నాడు. వారికి కరపత్రాలు అందిస్తూ వివరాలు తెలిస్తే తెలియజేయాలని అభ్యర్థిస్తున్నాడు. తన్న కుమార్తె ఎక్కడైనా దొరుకుతుందేమోనని ఆశతో అన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు. మరో వైపు తల్లి కూడా చిన్నారి ఎక్కడ ఉందో.. ఎలా ఉందో.. ఎవరి వద్ద ఉందో.. అంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది.

# రాయవరం పరిధిలో 20 కేసులకు లోక్ అదాలత్‌లో రాజీ



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 20 కేసులు శనివారం అనపర్తిలోని జేఎఫ్‌సీఎం కోర్టులో నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో పరస్పర రాజీ ద్వారా పరిష్కారమయ్యాయి. చిన్నచిన్న వివాదాలు, క్షణికావేశంలో నమోదైన కేసులను సత్వర పరిష్కారం చేసుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదికగా నిలుస్తుందని పోలీసులు తెలిపారు. అదే సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రహదారులపై వస్తువులు ఉంచి వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణదారులపై రాయవరం పోలీసులు 150 పెట్టీ కేసులు నమోదు చేయగా, ప్రతి కేసుకు రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు రాయవరం సబ్ ఇన్‌స్పెక్టర్ డి. సురేష్ బాబు వెల్లడించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రహదారులను ఆక్రమించకుండా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాజీ మార్గమే రాజమార్గం

### లోక్ అదాలత్ ద్వారా వేగంగా, శాశ్వత పరిష్కారం సాధ్యం

### ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీఎల్ఎస్ఏ ఛైర్మన్ (ఎఫ్ఏసీ), ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్.వేంకటేశ్వరరావు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన రీతిలో కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ అత్యుత్తమ ప్రత్యామ్నాయ వేదిక అని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఛైర్మన్ (ఎఫ్ఏసీ), ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వేంకటేశ్వరరావు అన్నారు. లోక్ అదాలత్‌ను ఒక ప్రజా ఉద్యమంలా నిర్వహించడం వల్ల ప్రజల్లో అవగాహనతో పాటు న్యాయ వ్యవస్థపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు.శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో సులభంగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు సమిష్టిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించడం వల్ల ప్రజల్లో లోక్ అదాలత్‌పై నమ్మకం మరింత బలపడుతుందని చెప్పారు.ప్రజల్లో న్యాయపరమైన అంశాలపై పూర్తి అవగాహన లేక చిన్నచిన్న వివాదాలకూ కోర్టులను ఆశ్రయించడం వల్ల కేసులు పేరుకుపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987 అమలులోకి వచ్చిందని, పేదలకు ఉచిత న్యాయసేవలు అందించడం, న్యాయ అవగాహన కల్పించడం, రాజీమార్గంలో వివాదాలను పరిష్కరించడం ఈ చట్టం ప్రధాన లక్ష్యాలని వివరించారు.సాధారణ న్యాయ ప్రక్రియలో ఒక కోర్టు నుంచి మరో కోర్టుకు కేసులు బదిలీ అవుతూ పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుందని, దీంతో సమయం, ధనం రెండూ వృథా అవుతాయని అన్నారు. అయితే "రాజీమార్గమే రాజమార్గం" అనే స్ఫూర్తితో పనిచేసే లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల అంగీకారంతో ఒకే విడతలో కేసులు పరిష్కారమవుతాయని, ఇందులో గెలుపోటములు ఉండవని, ఇరువర్గాలు సంతృప్తితో ఇంటికి వెళ్తారని తెలిపారు.గత మార్చి నెలలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 14 వేల కేసులు పరిష్కారం అయ్యాయని గుర్తు చేశారు. ఈసారి కూడా ప్రజలు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పరస్పర రాజీమార్గంలో తమ వివాదాలను పరిష్కరించుకో వాలని పిలుపునిచ్చారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 43 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయగా, రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ఆవరణలో 9 బెంచీల ద్వారా వివిధ రకాల కేసులను విచారించి రాజీమార్గంలో పరిష్కరించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ఛైర్మన్ (ఎఫ్ఏసీ), ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వేంకటేశ్వరరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.వి. ప్రసాద్, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్

# నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

### నూతన అధ్యక్షులుగా తమ్మినీడి లక్ష్మీనారాయణ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సేవే పరమావధిగా, సమాజ సేవలో రోటరీ క్లబ్ అఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఎప్పుడూ ముందుంటుందని, 2026 27వ సంవత్సరానికి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన రవి మెటల్స్ అండ్ ఫ్యాబ్రికేషన్స్ అధినేత తమ్మినీడి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక జెయన్ రోడ్‌లోని డీ -1 కన్వెన్షన్ సెంటర్లో రోటరీ క్లబ్ అఫ్ రాజమహేంద్ర వరం 2026-27 సం.కు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ ఘనంగా జరిగింది.కార్యదర్శి గా శ్యాం పొన్నాడ, ట్రెజరర్ గా ముకేష్ వాసన్, తదితర కార్య వర్గ సభ్యులను, రోటరీ ఇంటర్నేషనల్ ప్రతిపాదిత లాంచనా లతో రోటరీ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్ ఇన్స్టాలేషన్ ఆఫీసర్ గా ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ 2025-26 అధ్యక్షులు మండవల్లి వెంకన్న బాబు ఆధ్వర్యంలో కార్యదర్శి పీ రఘు నాథరాజు ట్రెజరర్ దావూద్ ఇబ్రహీం, తదితరులు చేసిన వివిధ సేవా కార్యక్రమాలను, కార్యదర్శి రఘునాథరాజు, పీపీటీ ద్వారా వివరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ చార్టర్ ప్రెసిడెంట్ తీగెలరాజా, తదితర రోటేరియన్స్ సమిష్టి సహాయ, సమ నవ్వయ, సంఘీభావ సేవలు, అభినందనీయమని, ఆదర్శ ప్రాయమని, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్ హర్ష ధ్వనులు మధ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో జి.ఎస్ ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఫాస్ట్ రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ ఇమ్మని వెంకట్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. కార్యదర్శి శ్యాం పొన్నాడ వందన సమర్పణ చేసేరు.

### వసతి గృహానికి ఫ్యాన్లు, పుస్తకాలు

# బహుకరించిన సాధన ఫౌండేషన్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కృష్ణానగర్ అమృత హాస్పిటల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం విద్యార్థినుల కోసం డాక్టర్ పర్వత వర్ధిని చందన ఆధ్వర్యంలోని సాధన ఫౌండేషన్ తరఫున సీలింగ్ ఫ్యాన్లు, విద్యా పుస్తకాలను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా విద్య, ఆరోగ్యం, మహిళా, బాలికల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను సాధన ఫౌండేషన్ ద్వారా నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. వసతి గృహం వార్డెన్, సిబ్బంది, విద్యార్థినులు సాధన ఫౌండేషన్‌కు, డాక్టర్ పర్వత వర్ధిని చందనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ విరాళం విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



# ఏడాది ముందే పుష్కర వ్యూహం

- గోదావరి తీరాన ఆధ్యాత్మిక వైభవానికి కూటమి ప్రభుత్వ సమగ్ర కార్యాచరణ
- సీఎం, డిప్యూటీ దిశానిర్దేశంతో పుష్కరాలకు ముందస్తు ఏర్పాట్లు
- ఆరు జిల్లాల్లో భక్తులకు అత్యున్నత సౌకర్యాలు - భద్రత, పారిశుధ్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- పుష్కర ఘాట్లు, రివర్ ఫ్రంట్, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించిన మంత్రులు పి.నారాయణ, కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే 2027 గోదావరి పుష్కరాలను దేశంలోనే ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక మహోత్సవంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఏడాది ముందుగానే సమగ్ర కార్యాచరణను ప్రారంభిం చిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం రాజమహేంద్రవరంలో విస్తృతంగా పర్యటించి పుష్కరాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనకు ముందు స్థానిక హోటల్‌లో రాజమహేంద్రవరం మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. పుష్కరాల మాస్టర్ ప్లాన్, కేంద్ర ప్రభుత్వ సహకారం, నిధుల కేటాయింపు, శాఖల సమన్వయంపై విస్తృతంగా చర్చించారు. అనంతరం కోటిలింగాల ఘాట్, పుష్కర్ ఘాట్లను సందర్శించిన మంత్రులు భక్తుల సౌకర్యాల కోసం చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. సుమారు రెండు కిలో మీటర్ల మేర నడక మార్గంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆర్ఎమ్‌సి కార్యాలయంలో అధికారుల సమీక్ష నిర్వహించి, గోదావరి రివర్ ఫ్రంట్, ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, నగరంలోని డ్రైనేజీ, సివరేజ్ వ్యవస్థల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నతాధికారులతో కలిసి పుష్కరాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

**భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం : మంత్రి నారాయణ**

మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ, 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధమవుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే పలుమార్లు ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వ హించి అన్ని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఇరిగేషన్, దేవాదాయ, హోం, మున్సిపల్, ఆర్ అండ్ బీ, పర్యాటక తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. రాజమహేంద్రవరం నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.585 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నిధులతో ప్రధాన రహదారులు, డ్రైనేజీ, సివరేజ్, తాగునీటి సరఫరా, పారిశుధ్య వ్యవస్థలను ఆధునికీకరిస్తామని తెలిపారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశముందని, అందుకే ఏడాది ముందుగానే పక్కా ప్రణాళికతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే ఇరిగేషన్ శాఖకు సంబంధించిన సివిల్ పనులు వేగవంతం అవుతాయని తెలిపారు.

**అఖండ గోదావరి ప్రాజెక్టుతో ఆధ్యాత్మిక - పర్యాటక అభివృద్ధి : మంత్రి కందుల దుర్గేష్**

మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, దేవాదాయ, పర్యాటక శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో జరిగిన లోపాలను పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలతో కార్యాచరణ రూపొందించామని చెప్పారు. 'అఖండ గోదావరి' పర్యాటక ప్రాజెక్టు ద్వారా గోదావరి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని, రాజమహేంద్రవరం ఘాట్ల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా హోమ్ స్టేలు, టెంట్ సిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. టెంపుల్ టూరిజంతో పాటు అన్ని రకాల పర్యాటక రంగాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, గత పుష్కరాల కంటే మెరుగైన ఏర్పాట్లు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో కాలుష్య నియంత్రణ మండలి ద్వారా రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మంత్రి కందుల దుర్గేష్ సహకారంతో రూ.100 కోట్ల వ్యయంతో 'అఖండ గోదావరి' పనులు జరుగుతున్నాయని చెప్పారు. అదేవిధంగా విద్యుత్ పనులకు రూ.50 కోట్లు, రివర్ ఫ్రంట్‌కు రూ.22 కోట్లు, అమృత్-2.0 కింద రూ.95 కోట్లు, ఖేలో ఇండియా పథకం కింద రూ.14 కోట్లు కేటాయించినట్లు వివరించారు. గోదావరి జిల్లాల ప్రజల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ ఈ పుష్కరాలను ప్రభుత్వం అంగరంగ వైభవంగా నిర్వహిస్తుందని తెలిపారు.

**నిధుల సమీకరణకు ప్రభుత్వం కృషి ఎమ్మెల్సీ సోము వీర్రాజు**

ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ పుష్కరాల నిర్వహణలో ఎక్కడా రాజీపడకుండా ప్రభుత్వం నిధులను సమకూరుస్తోందన్నారు. పోలవరం అథారిటీతో చర్చించి లెఫ్ట్ మెయిన్ కెనాల్ అభివృద్ధికి రూ.250 కోట్ల నిధుల సమీకరణకు ప్రయత్నాలు జరుగు తున్నాయని తెలిపారు.

**రూ.580 కోట్లతో తొలి దశ పనులు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కరాల తొలి దశ పనులకు రూ.580 కోట్ల నిధుల కేటాయింపు చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. విద్యుత్ శాఖ అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులు, దేవాదాయ శాఖ రూ.15 కోట్ల పనులు, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు తదితర అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించినట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో కాలుష్య నియంత్రణ మండలి ద్వారా రూ.100 కోట్ల నిధులు, మంత్రి కందుల దుర్గేష్ సహకారంతో రూ.100 కోట్ల అఖండ గోదావరి ప్రాజెక్టు, విద్యుత్ పనులకు రూ.50 కోట్లు, రివర్ ఫ్రంట్‌కు రూ.22 కోట్లు, అమృత్-2.0 కింద రూ.95 కోట్లు, ఖేలో ఇండియా ద్వారా రూ.14 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ గత పుష్కరాల కంటే అత్యుత్తమంగా ఈ పుష్కరాలను నిర్వహిస్తామని తెలిపారు.

**ఘాట్ల సంఖ్య పెంపుతో శాశ్వత అభివృద్ధి : ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఇప్పటికే అన్ని శాఖలు పుష్కర పనుల్లో నిమగ్న మయ్యాయని తెలిపారు.

మంత్రి నారాయణ చొరవతో నగరంలో శాశ్వత మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఘాట్ల సంఖ్యను రెట్టింపు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ధవళేశ్వరం నుంచి వెంకటనగరం వరకు ఉన్న అన్ని ఘాట్ల అభివృద్ధికి నిధులు కేటాయించ నున్నట్లు తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని, నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని చెప్పారు. అంతకు ముందు స్థానిక ప్రవేటు అతిథి గృహంలో మంత్రి నారాయణ కు జిల్లా మంత్రి కందుల దుర్గేష్ స్వాగతం పలికి, మెమంటో అందచేశారు. ఈ పర్యటనలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ క్షితిజ్ ఆదిత్య శర్మ, ఇరిగేషన్ ఎస్.ఈ. జి. శ్రీనివాసరావు, టూరిజం రీజినల్ డైరెక్టర్ ఎన్.వి.వి.ఎస్. మూర్తి, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జి.ఎస్.రావు మృతి

**జిఎస్ రావు మృతి పట్ల జక్కంపూడి దిగ్భ్రాంతి**
**నేడు నిడదవోలు చేరుకోనున్న రావు భౌతిక కాయం**
**తాళ్లపూడి మండలం పెద్దేవంలో అంత్యక్రియలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి నేత జి.ఎస్.రావు మృతి పట్ల వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు వైఎస్ఆర్సిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో శనివారం మధ్యాహ్నం 2.19 గంటలకు కుటుంబ సభ్యుల సమక్షంలో తుదిశ్వాస విడిచారు.

**నేడు నిడదవోలు రానున్న రావు భౌతిక కాయం:**

నిడదవోలు నియోజక వర్గంలో ప్రజల సందర్శ నార్థం నిడదవోలు పట్టణంలో ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యా హ్నం 1 గంటల వరకు ఉంచుతారని కుటుంబ సభ్యులు తెలిపారు. నిడదవోలు నుంచి ప్రారంభమై అంతిమయాత్ర తాళ్లపూడి మండలంలో ఆయన స్వగ్రామమైన పెద్దేవం వరకు కొనసాగుతుం దన్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుండి అంత్యక్రియలు నిర్వహిస్తారని వెల్లడించారు.

మండుటెండలో కాలినడకన

# వెంకన్నను దర్శించుకున్న కోటిగ్రామం విద్యార్థులు

**విద్యార్థుల్లో వెల్లువిరుస్తున్న భక్తి భావం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం కోటి గ్రామం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు గుమ్మళ్ళదొడ్డి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని పలు కోరికలు కోరారు. శనివారం కోటి గ్రామానికి చెందిన జడ్పీ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు చెప్పులు లేకుండా కాలినడకన సుమారు 15 కిలోమీటర్ల మేర మండుటెండలో గుమ్మళ్ళదొడ్డి వెంకన్న దర్శించుకుని, తామంతా 9వ తరగతి నుండి పదవ తరగతిలోకి వచ్చామని, పదవ తరగతిలో స్వామి ఆశీస్సులతో చదువులలో చక్కగా రాణించి, మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని స్వామి ఆశీస్సుల కోసం విచ్చేసామన్నారు. స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఆలయం వారి ఇచ్చిన ఆతిథ్యంతో సేద తీరారు. ఏది ఏమైనా విద్యార్థులలో ఆధ్యాత్మిక, భక్తి భావం పెరగడం శుభ పరిణామన్ని పలువురు వాపోతున్నారు.

సీతానగరం విహెచ్సిలో

# ప్రపంచ జనాభా దినోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ ఈ భవాని డాక్టర్ ఎం.శైలజారాణి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలు గురించి మరియు యువ జనాభా తగ్గకుండా ఉండడం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ భవాని మాట్లాడుతూ జనాభా స్థిరీకరణ కోసం ప్రతి దంపతులు బిడ్డ బిడ్డకు కనీసం మూడు సంవత్స రములు ఎడం ఉండేలాగా జాగ్రత్త తీసుకోవాలని ఆడ పిల్లకు 18 సంవత్సరాల దాటిన తర్వాతే పెళ్లి చేసి బాల్య వివాహాలు నివారిం చాలని దంపతులు తాత్కా లిక మరియు శాశ్వత కుటుం బ నియంత్రణ పద్ధతులు పాటించాలని తెలియ జే శారు. అనంతరం సిహెచ్ వైద్య ఆరోగ్య సిబ్బంది "పిల్లల మధ్య ఎడం పాటిద్దాం- ఆరోగ్యకరమైన ఆనందకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం"అని నినాదాలు చేస్తూ ప్లే కార్డులు ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇఓ వైయస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్లు కె.సుధాకర్, ఎన్.అనురాధ, స్టాఫ్ నర్సులు కిరణ్మయి, నాగమణి, ఫార్మాసిస్ట నగేష్,ఎస్ టిఎస్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు ఎం. ఎల్.హెచ్.పి.లు,, ఆశ కార్యకర్తలు, ఆసుపత్రి ఓ.పి సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**నూతన అధ్యక్షులుగా మోతా బాల విజయ సారథి**
**కార్యదర్శిగా గండ్రోతు వేణుగోపాలస్వామి (గోపీ)**
**కోశాధికారిగా శ్రీపాద పురుషోత్తమ కుమార్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతిష్టాత్మక ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికలు కోలహాలంగా జరిగాయి. మూడు ప్యానళ్లు ఈఎన్నికల్లో పోటీ పడగా ఓటర్లైన విలేఖర్లు, మీడియా ప్రతినిధులు పరిణతి ప్రదర్శించి ఓట్లు వేయడంతో మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. అధ్యక్షులుగా మోతా బాల విజయ సారథి, కార్యదర్శిగా గండ్రోతు వేణుగోపాలస్వామి అలియాస్ గోపీ, ఉపాధ్యక్షులుగా పి. ఎస్. గంగాధర్, కొత్తపల్లి దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా సోమాబత్తుల కృపానందం, కెవిఎన్ వరప్రసాద్, కోశాధికారిగా శ్రీపాద పురుషోత్తమ కుమార్ ఎన్నికయ్యారు. ఆకుల ఈశ్వర్, కొట్టే మధు.ఆర్ వి వి సత్యనారాయణ, పి. చంటిబాబు, పాలపర్తి శ్రీనివాస్, గరగ ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో సుమారు 165 మంది వరకూ సభ్యులు ఉన్నారు. 157 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండేలా శ్రీరామమూర్తి, ఆంధ్రజ్యోతి మోతా బాల విజయ సారథి, టి.వి. నైన్ సత్య ప్యానళ్ళు ఎన్నికల బరిలో పోటీ చేశాయి.. ఎన్నికల అధికారులుగా శ్రీనివాస రెడ్డి, టి.వి.ఫైవ్ స్వామీ, కోస్తాఎన్ కౌంటర్ కళాధర్, వేగి గణేష్...వ్యవహరించారు.ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు, సిసిసి, బిసిఎన్ యాజమాన్యం అభినందించారు.

సాగునీరు విడుదల కార్యక్రమంలో

# పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బొడ్డు



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం కాటవరం ఎత్తి పోతల పథకం ద్వారా సాగునీటి విడు దల కార్యక్రమంలో రాజానగరం నియో జకవర్గ శాసనసభ్యులు బత్తుల బల రామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వేంకట రమణ చౌదరి పాల్గొన్నారు. తొలుత పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్విచ్ ఆన్ చేయడం ద్వారా సాగునీటిని అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రాజానగరం నియోజకవర్గంలోని అన్నదాతలు నీటి ఎద్దడితో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, పంటలు సాగు చేసుకునేందుకు సకాలంలో నీరందించదానికి మేము కట్టుబడిఉన్నామని. అందులో భాగంగానే నేడు కాటవరం ఎత్తి పోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయడం జరిగిందని, పసిడి పంటలు పండించే మన రైతన్నల ముఖాల్లో ఆనందం చూడ టమే మా లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. సీతానగరం మండల పరిధిలో సుమారు 3,000 ఎకరాల సాగు భూమికి సమృద్ధిగా సాగునీరు అందనుందని రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని ఆకాం క్షించారు. సకాలంలో నీటిని విడుదల చేసినందుకు ప్రజాప్ర తినిధులకు రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు, వీర మహి ళలు, కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతి నిధులు మరియు పెద్ద సంఖ్యలో అన్న దాతలు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచరుం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

### లెనిన్‌లో భాగ్యశ్రీ అక్క పాత్రలో నటించిన


# ఈ అమ్మాయి ఎవరో తెలుసా..?



ప్రస్తుతం థియేటర్లలో దూసుకుపోతున్న చిత్రాల్లో లెనిన్ ఒకటి. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై భారీ విజయాన్ని అందుకున్న ఈ సినిమా ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. ఈ క్రమంలోనే ఈ చిత్రంలో నటించిన ఓ అమ్మడు స్పెషల్ అట్రాక్షన్ అవుతుంది. ఇప్పుడు అందరూ ఆమె గురించి మాట్లాడుకుంటున్నారు. అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన లేటెస్ట్ మూవీ 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద థియేటర్లలో సూపర్ రన్ అవుతోంది. ఈ సినిమాలో అఖిల్ పర్ఫార్మెన్స్, హీరోయిన్‌గా భాగ్యశ్రీ భోర్సే నటన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మొదటి రోజే ఈ చిత్రం రూ.16.7 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతుంది. ఇక ఇప్పుడు శనివారం, ఆదివారాల్లో ఈ మూవీ కలెక్షన్స్ మరింత పెరిగే ఛాన్స్ ఉందని అంటున్నారు సినీవిశ్లేషకుల. చాలా కాలం తర్వాత అఖిల్ ఖాతాలో మొదటి సారి సాలిడ్ హిట్ పడింది. శనివారం ఈ మూవీ సక్సెస్ మీట్ నిర్వహించింది చిత్రయూనిట్. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ భాగ్యశ్రీ కంటే ఎక్కువగా అందరి దృష్టిని ఆకర్షిస్తూ, కథను ఊహించని మలుపులు తిప్పిన ఒక కీలక పాత్ర ఉంది. అదే హీరోయిన్ అక్క 'వైదేహి' క్యారెక్టర్! సినిమా చూసి థియేటర్ల నుంచి బయటకు వస్తున్న ఆడియన్స్ అంతా.. ఆ వైదేహి పాత్రలో నటించిన అమ్మాయి ఎవరబ్బా అని గూగుల్‌లో తెగ వెతికేస్తున్నారు. ఎందుకంటే ఆ క్యారెక్టర్‌తో సినిమాలో వచ్చే రెండు పెద్ద ట్విస్ట్‌లు ప్రేక్షకులను షాక్‌కు గురిచేస్తున్నాయి. దీంతో ఈ అమ్మడు గురించి తెలుసుకోవడానికి తెగ ప్రయత్నిస్తున్నారు మేకర్స్. ఇంతకీ ఈ వైదేహి పాత్రలో నటించిన బ్యూటీ ఎవరో తెలుసా. ఆమె మరెవరో కాదు.. పక్కా తెలుగమ్మాయి శ్రావణి కృష్ణవేణి రెడ్డి గుంతబిల్లు. శ్రావణి కెరీర్ తొలినాళ్లలో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, పలు షార్ట్ ఫిలిమ్స్ ద్వారా తన టాలెంట్ నిరూపించుకుంది. ఒకవైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే, సినిమాపై ఉన్న ప్యాషన్‌తో ఆడిషన్స్ ఇస్తూ అవకాశాల కోసం ప్రయత్నించింది. ఈ క్రమంలోనే గతేడాది విడుదలైన 'లవ్ రెడ్డి' సినిమాలో హీరోయిన్‌గా నటించి, తన ఎమోషనల్ యాక్టింగ్‌తో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు 'లెనిన్' సినిమాలో కేవలం హీరోయిన్ అక్కగానే కాకుండా, కథను మలుపు తిప్పే అత్యంత ప్రాధాన్యత ఉన్న పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించింది. ఈ సినిమాతో పాటు ప్రస్తుతం కిరణ్ అబ్బవరం నిర్మిస్తున్న 'గువ్వల చెరువు ఘాట్' అనే వెబ్ సిరీస్‌లో కూడా శ్రావణి ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. లెనిన్ సినిమాలో ఈమె నటన, స్క్రీన్ ప్రెజెన్స్ చూస్తుంటే, రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో మంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, అలాగే పవర్‌ఫుల్ సపోర్టింగ్ రోల్స్‌కు ఈ తెలుగమ్మాయి బెస్ట్ ఛాయిస్ కాబోతోందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. సినిమా సక్సెస్‌తో ఎంజాయ్ చేస్తున్న శ్రావణి, షూటింగ్ సెట్స్ కి సంబంధించిన కొన్ని రేర్ వర్కింగ్ స్టిల్స్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేయగా, అవి ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి.

### గత్తరలేపుతున్న సీరియల్ బ్యూటీ..

# ఎలాంటి కుర్రాడైనా లవ్‌లో పడిపోవాల్సిందే



సినిమాలకు, సీరియల్స్ కు మన దగ్గర విపరీత మైన క్రేజ్ ఉంది. సినిమాలకు సమానంగా సీరియల్స్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. లాక్ డౌన్ తర్వాత సీరియల్స్ చూసే ఆడియన్స్ సంఖ్య భారీగా పెరిగిపోయింది. రకరకాల సీరియల్స్ ఇప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటూ దూసుకుపోతున్నాయి. టీవీ సీరియల్స్ క్రేజ్ రోజు రోజుకు పెరిగిపోతుంది. ఓటీటీలు కూడా పెరిగిపోవడంతో పేక్షకులను ఆకట్టుకోవడానికి రకరకాల సీరియల్స్ సిద్ధం అవుతున్నాయి. సినిమాల మాదిరిగానే సీరియల్స్ కూడా దూసుకుపోతున్నాయి. ఇక సీరియల్స్‌లో నటించిన చాలా మంది ముద్దుగుమ్మలు ఇప్పుడు సినిమాల్లోనూ అవకాశాలు అందుకుంటున్నారు. సీరియల్స్ లో నటించే చాలా మంది హీరోయిన్స్ కు మించిన అందంతో కట్టిపడేస్తున్నారు. సీరియల్స్ లో చీరకట్టులో యావరేజ్ గా కనిపించే భామలు సోషల్ మీడియాలో మాత్రం వారెవ్వా అనేలా.. తమ అందాలతో అభిమానులు అవాక్ అయ్యేలా చేస్తున్నారు. ఇక ఇప్పుడు అలాంటి వయ్యారి ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. సీరియల్ లో పద్దతిగా కనిపించే ఆమె బయట మాత్రం యమా హాట్ గురూ అనేలా ఉంటుంది. ఈ అమ్మడి లేటెస్ట్ ఫొటోలతో టాక్ ఆఫ్ ది సోషల్ మీడియాగా మారిపోయింది ఇంతకూ ఆ అమ్మడు ఎవరో గుర్తుపట్టారా.? కన్నడ భాషలో శ్రీ గౌరీ అనే సీరియల్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. ఆమె అమూల్య గౌడ అలాగే అక్కడ బిగ్ బాస్ గేమ్ షోలోనూ పాల్గొంది. బిగ్ బాస్ లో తన అందంతో పాటు ఆటతోనూ ఆకట్టుకుంది ఈ వయ్యారి భామ. అయితే సీరియల్స్ లో పద్దతిగా కనిపించే అమూల్య గౌడ.. బయట మాత్రం చాలా హాట్ గురూ.. ఈ అమ్మడి సోషల్ మీడియా పోస్ట్ లు చూస్తే మతిపోవాల్సిందే.. తన అందాలతో మతిపోగొడుతోంది అమూల్య. సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. అందాల ఆరబోతలో హీరోయిన్స్ కు ఈ మాత్రం తీసిపోవడం లేదు ఈ సీరియల్ నటి. అమూల్య ఇన్ స్టా గ్రామ్ లో 5 లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. హాట్ హాట్ ఫోటోలను వీడియోలను షేర్ చేస్తూ అభిమానులను కవ్విస్తుంది అమూల్య. ఈ ఫోటోలు, వీడియోలు చూసి షాక్ అవుతున్నారు నెటిజన్స్. ఆమె ఈమేనా అని కామెంట్స్ చేస్తున్నారు. సీరియల్స్‌లో పద్దతిగా కనిపిస్తుంది.. సోషల్ మీడియాలో మాత్రం సెగలు రేపుతోంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ అమ్మడు తెలుగుతో పాటు కన్నడలోనూ సీరియల్స్ చేస్తుంది. హీరోయిన్స్ కు ఏ మాత్రం తీసిపోని ఈ వయ్యారి అందానికి కుర్రకారు కిర్రెక్కిపోతున్నారు.

# టీమిండియా బౌలర్లను ఉతికేసిన బ్రూక్, బట్లర్..

ఇంగ్లండ్‌తో ఐదో టీ20లో జోస్ బట్లర్ సెంచరీ, హ్యారీ బ్రూక్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఇంగ్లండ్ 257/3 భారీ స్కోరు చేసింది. భారత్ గెలవాలంటే 258 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. భారత బౌలింగ్, ఫీల్డింగ్ తీవ్రంగా నిరాశపరిచాయి. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదో ఆఖరి టీ20 మ్యాచ్‌లో భారత బౌలర్లకు ఇంగ్లీష్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. సౌతాంప్టన్‌లోని ది రోజ్ బౌల్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓపెనర్ జోస్ బట్లర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. భారత బౌలర్లపై సిక్సర్లు, ఫోర్లతో దండయాత్ర చేశాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు పెద్దగా ప్రభావం చూపని బట్లర్.. కీలకమైన ఆఖరి మ్యాచ్‌లో మాత్రం విశ్వరూపం చూపించారు. టాస్ గెలిచి మొదట ఫీల్డింగ్ ఎంచుకున్న భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయాన్ని తలకిందులు చేస్తూ ఇంగ్లండ్ బ్యాటర్లు మొదటి నుంచే బౌండరీల వేట సాగించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు ప్రారంభంలోనే ఓపెనర్ ఫిల్ సాల్ట్ (6) వికెట్ పడగొట్టి ప్రసిద్ధ్ కృష్ణ మంచి బ్రేక్‌త్రూ ఇచ్చాడు. సాల్ట్ ఇచ్చిన క్యాచ్‌ను సూర్యాన్ష్ షెడ్గే అద్భుతంగా అందుకున్నాడు. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో కలిసి జోస్ బట్లర్ ఇన్నింగ్స్‌ను పూర్తిగా మార్చేశాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 233 పరుగుల



భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలోనే బట్లర్ కేవలం 51 బంతుల్లోనే తన సెంచరీ మార్కును అందుకున్నాడు. అవుట్ అయ్యే సమయానికి బట్లర్ 64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 131 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. మరోవైపు కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని భారత్‌కు కోలుకోలేని దెబ్బ తీశాడు. మొత్తంగా తాను ఈ మ్యాచులో 95 పరుగులు సాధించి సెంచరీ మిస్ చేసుకున్నాడు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ మాత్రమే 4 ఓవర్లలో 33 రన్స్ ఇచ్చి కొంతవరకు కట్టడి చేయగలిగాడు. మిగిలిన బౌలర్లందరినీ ఇంగ్లండ్ బ్యాటర్లు బెంబేలెత్తించారు.

అక్షర్ పటేల్ వేసిన ఓ ఓవర్లో బ్రూక్ రెండు సిక్సర్లు, ఒక ఫోర్‌తో 25 పరుగులు రాబట్టగా.. సూర్యాన్ష్ షెడ్గే ఓవర్లో 24 పరుగులు వచ్చాయి. అయితే ఇన్నింగ్స్ 19వ ఓవర్ వేసిన శివమ్ దూబే ఓవర్ మ్యాచ్‌లోనే అత్యంత ఆసక్తికరంగా మారింది. ఆ ఓవర్లో 6, 6, 4, ఔ, ఔ, 6 చొప్పున ఏకంగా 22 పరుగులు వచ్చాయి. కాకపోతే, ఇదే ఓవర్లో దూబే సెంచరీ హీరో జోస్ బట్లర్‌ను శ్రేయస్ అయ్యర్ క్యాచ్ ద్వారా అవుట్ చేయడమే కాకుండా.. ఆ తర్వాతి బంతికే జాకబ్ బెథెల్‌ను డకౌట్‌గా వెనక్కి పంపడం విశేషం. ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ వైఫల్యాలు మరోసారి స్పష్టంగా కనిపించాయి. ప్రిన్స్ యాదవ్ వేసిన ఇన్నింగ్స్ 6వ ఓవర్లో శివమ్ దూబే అత్యంత సులువైన క్యాచ్‌ను వదిలేసి హ్యారీ బ్రూక్‌కు లైఫ్ ఇచ్చాడు. ఆ తర్వాత బట్లర్ ఇచ్చిన క్యాచ్‌ను సూర్యాన్ష్ షెడ్గే కూడా నేలపాలు చేశాడు. ఈ అందివచ్చిన అవకాశాలను వాడుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లు చివరకు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచారు. ఒకవేళ భారత్ ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పరువు నిలుపుకోవాలంటే టీమిండియా బ్యాటర్లు కూడా ఇదే రేంజ్‌లో భారీ హిట్టింగ్‌తో విరుచుకుపడాల్సి ఉంటుంది.

# 1605 రోజుల నంబర్-1 సామ్రాజ్యం కూలిపోయే వేళ.. అయ్యర్ కెప్టెన్సీలో ఖాతా తెరిచేనా?

ఇంగ్లాండ్‌తో ఐదో టీ20లో టీమిండియాకు డూ ఆర్ డై పరిస్థితి నెలకొంది. ఈ మ్యాచ్ ఓడితే 1605 రోజులుగా కొనసాగుతున్న ఐసీసీ టీ20 నంబర్-1 ర్యాంక్ కోల్పోయే ప్రమాదం ఉంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో తొలి విజయంపై అందరి దృష్టి నిలిచింది. భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు అత్యంత ఆందోళన కలిగించే వార్త ఇది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో గత 1605 రోజులుగా రారాజులా వెలుగుతున్న టీమిండియా సింహాసనం ఇప్పుడు తీవ్ర ప్రమాదంలో పడింది. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టు ఈరోజు (జూలై 11, శనివారం) ఆతిథ్య జట్టుతో ఐదో మరియు చివరి టీ20 మ్యాచ్ ఆడనుంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఇప్పటికే 3-0తో తిరుగులేని ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యంలో నేడు జరగబోయే ఐదో టీ20 మ్యాచ్ టీమిండియాకు కేవలం పరువు కాపాడుకునే మ్యాచ్ మాత్రమే కాదు.. తమ నంబర్-1 స్థానాన్ని కాపాడుకోవడానికి చావో రేవో లాంటి పోరాటం కానుంది.

**ఈ ఒక్క మ్యాచ్ ఓడిపోతే నంబర్-1 నుంచి అవుట్**

ప్రస్తుత ఐసీసీ టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌ను పరిశీలిస్తే.. భారత జట్టు మొదటి స్థానంలో, ఇంగ్లాండ్ జట్టు రెండవ స్థానంలో ఉన్నాయి. అయితే, నేటి మ్యాచ్ గనుక ఇంగ్లాండ్ గెలిస్తే, పాయింట్ల పట్టికలో సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. భారత్‌ను కిందకు నెట్టి ఇంగ్లాండ్ ప్రపంచ నంబర్-1 టీ20 జట్టుగా అవతరిస్తుంది. దాదాపు నాలుగేళ్లకు పైగా ప్రపంచ క్రికెట్‌ను శాసించిన భారత జట్టు ర్యాంకింగ్స్ కిరీటం చేజారిపోకుండా ఉండాలంటే.. నేటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను ఖచ్చితంగా ఓడించాల్సిందే. ఈ ఏకైక మ్యాచ్ ఫలితం ఇరు జట్ల భవితవ్యాన్ని మార్చబోతుండటంతో ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

**శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో ఖాతా తెరిచేనా?**

భారత కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో టీమిండియా ఇప్పటివరకు ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయింది. ఈ బ్రిటన్ పర్యటనకు ముందు ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ ఘోరంగా క్లీన్ స్వీప్ (2-0తో ఓటమి) అయ్యింది. ఇప్పుడు ఇంగ్లాండ్ చేతిలో కూడా వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయి తీవ్ర ఒత్తిడిలో ఉంది. కనీసం చివరి మ్యాచ్‌నైనా గెలిచి మరో ఘోరమైన క్లీన్ స్వీప్ పరాభవం నుండి తప్పించుకోవాలని జట్టు భావిస్తోంది. అటు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ద్వయం తమపై వస్తున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం అత్యంత కీలకం.




**టీవీ, మొబైల్‌లో లైవ్ ఎక్కడ చూడాలంటే?**

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగే ఈ చారిత్రాత్మక ఐదో టీ20 పోరు సౌతాంప్టన్‌లోని ప్రసిద్ధ ది రోజ్ బౌల్ స్టేడియంలో జరగనుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 7:00 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుండగా.. సాయంత్రం 6:30 గంటలకు టాస్ పడనుంది. ఈ రసవత్తర పోరును టీవీల్లో వీక్షించాలనుకునే వారు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారాన్ని చూడవచ్చు. అలాగే మొబైల్ వినియోగదారులు సోనీ లివ్ యాప్, జియోస్టార్?లలో ఈ మ్యాచ్ లైవ్ స్ట్రీమింగ్‌ను ఆస్వాదించవచ్చు.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com